


www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

MONDAY 29TH JUNE 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 103 COST : 3\- KHAMMAM, TELANGANA

సోమవారం 29 జూన్ 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక : 103 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## బస్సు బోల్తా.. 30 మంది ప్రయాణికులకు గాయాలు

వనపర్తి, జూన్ 29: వనపర్తి జిల్లా పెబ్బేరు సమీపంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై ప్రయాణికులతో వెళ్తున్న టీజీఎస్ ఆర్టీసీ బస్సు సోమవారం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 30 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. రహదారిపై వెళ్తున్న వాహనదారులతో పాటు స్థానికులు వెంటనే స్పందించి.. వారిని పెబ్బేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రయాణికులకు స్వల్పంగా గాయాలయ్యాయని వైద్యులు వెల్లడించారు. వారికి ప్రాథమిక చికిత్స అందించినట్లు చెప్పారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులతోపాటు ఆర్టీసీ ఉన్నతాధికారులు వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు.

# దేశ ప్రగతిలో పీవీ పాత్ర మరువలేనిది

- పీవీ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ఘన నివాళి
- ఆయన ఆర్థిక సంస్కరణలు దేశ ప్రగతికి బాటలు : ఖర్గే
- పీవీకి గవర్నర్ శుక్లా, సీఎం రేవంత్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నివాళి
- పీవీ సమాధి వద్ద నివాళులర్పించిన ప్రముఖులు



న్యూఢిల్లీ, హైదరాబాద్, రాంగోపాల్‌పేట్, రవీంద్రభారతి, జూన్ 28(అక్షరంన్యూస్) దేశ ప్రగతిలో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు పాత్ర మరువలేనిదని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. దేశ చరిత్రలోనే అత్యంత కీలకమైన తరుణంలో ఆయన అందించిన సేవలు గొప్పవన్నారు. పీవీ 105వ జయంతి సందర్భంగా ప్రధాని ఆయనకు ఎక్స్ వేదికగా నివాళు లర్పించారు. పీవీ ఆర్థిక సంస్కర ణలు దేశ ప్రగతికి బాటలుగా మారాయని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. ప్రధానిగా పీవీ ప్రవేశపెట్టిన విప్లవాత్మక ఆర్థిక సరళీకరణ విధానాలు దేశ వృద్ధిని వేగవంతం చేశాయంటూ ఆయన ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నిర్వ హించిన వేడుకల్లో రెసిడెంట్ కమిషనర్ శశాంక్ గోయల్ పీవీకి నివాళుల ర్పించారు. ఇటు హైదరాబాద్‌లో

➤ మిగతా 2వ పేజిలో..



## ఉద్యమకారులందరికీ న్యాయం

**బీఆర్ఎస్ ఉద్యమకారులను మోసం చేసింది**

**ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి జూపల్లి**

కవాడిగూడ, జూన్ 28(అక్షరంన్యూస్) తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పని చేసిన తొలిదశ , మలిదశ ఉద్యమకారులతోపాటు ఉద్యమంలో పాల్గొన్న చివరి ఉద్యమకారుని వరకు న్యాయం చేసేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్

➤ మిగతా 2వ పేజిలో..



## ట్రస్టుకు ముందే తెలుసు!

- అయోధ్య రామాలయంలో విరాళాల దోపిడీ వ్యవహారంపై పక్కా సమాచారం ఉంది
- ఈ నెల 5వ తేదీనే నిందితుడి ఇంట్లోపోలీసులతో కలిసి ట్రస్టు సోదా

అయోధ్య, జూన్ 28(అక్షరంన్యూస్)అయోధ్య రామాలయంలో విరాళాల దోపిడీ వ్యవహారం బహిరంగం కావడానికి ముందే తీర్థక్షేత్ర ట్రస్టుకు తెలుసా?.. నిందితుడిని కూడా ట్రస్టు గుర్తించిందా?.. అంటే ఔననే సమాదఞానమే వినిపిస్తోంది. ఈ నెల 7న విరాళాల గోల్‌మాల్ వ్యవహారం బయటకు పొక్కింది. అయితే.. దీనికి రెండురోజుల ముందే అంటే.. ఈ నెల 5వ తేదీనే ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్‌కు ఈ విషయం తెలుసునని అధికారులు నిర్ధారించారు. అంతేకాదు.. ప్రస్తుతం ఈ కేసులో నిందితుడిగా ఉన్న అవినాశ్ శుక్లా ఇంట్లో అదే రోజు ట్రస్టు ప్రతినిధులతో పాటు పోలీసులు సోదాలు చేపట్టి కొంత మేరకు

➤ మిగతా 2వ పేజిలో..

# ప్రజలకే ప్రాధాన్యం.. అభివృద్ధికే పెద్దపీట



- ఎవడు అడ్డు పడ్డా మూసిలో వేసి తొక్కుతా
- ఎన్ని ఆటంకాలు ఎదురైనా మూసీ ప్రక్షాళన పూర్తి చేసి తీరుతాం
- వచ్చే ఎన్నికల నాటికి ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తామని హామీ
- నల్గొండలో రూ.83 కోట్ల తాగునీటి పథకానికి శంకుస్థాపన
- నల్గొండ అభివృద్ధికి కొత్త దిశ
- ప్రజలకే ప్రాధాన్యం.. అభివృద్ధికే పెద్దపీట
- ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

నల్గొండ, జూన్ 28(అక్షరంన్యూస్)ఎలాంటి ఆటంకాలు ఎదురైనా.. ఎవడు ఆత్మహత్య చేసుకున్నా, ఎవడు అడ్డం పడ్డా మూసిలో వేసి తొక్కి మూసీ నది ప్రక్షాళనను పూర్తి చేసి తీరుతానని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నల్గొండ జిల్లా కనగల్ మార్కెట్ యార్డులో హ్యామ్ రోడ్ల నిర్మాణానికి పైలాన్ ఆవిష్కరించిన అనంతరం నల్గొండ పట్టణంలో తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.83 కోట్లతో చేపట్టనున్న తాగునీటి పథకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. మూసీ నది ప్రక్షాళన తన కల అని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఆ పనిని పూర్తి చేసి దేశానికే ఆదర్శంగా నిలిపేలా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. మూసీ కాలుష్యం కారణంగా ఇబ్రహీంపట్నం, భువనగిరి, మునుగోడు, నల్గొండ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన ద్వారా ఆ ప్రాంత ప్రజలకు శాశ్వత ఉపశమనం కల్పిస్తామని, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.వచ్చే ఎన్నికల నాటికి శ్రీశైలం ఎడమ కాలువ (ఎస్ఎల్‌బీసీ) ప్రాజెక్టును నూటికి నూరు శాతం పూర్తి చేసి కృష్ణా జలాలను నల్గొండ నేలకు తీసుకొస్తామని సీఎం హామీ ఇచ్చారు. డిండి ప్రాజెక్టు పూర్తి చేయడానికీ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. జిల్లాలో సాగునీటి వసతులు, తాగునీటి సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రతి ప్రాజెక్టును వేగవంతం

➤ మిగతా 2వ పేజిలో..

## కొత్త వాళ్లకు కీలక శాఖలు!

- పార్లమెంటు సమావేశాల్లోపే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ



న్యూఢిల్లీ, జూన్ 28 (అక్షరంన్యూస్) కేంద్ర మంత్రివర్గంలో భారీ మార్పులు తప్పవన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ముఖ్యంగా కీలక శాఖలు కొత్తవారికి దక్కనున్నట్లు తెలిసింది. అయితే మొదట బీజేపీ

➤ మిగతా 2వ పేజిలో..

## తెలంగాణలో కమలం వికసింపజేద్దాం: కిషన్ రెడ్డి

- బీజేపీ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనం
- ఎస్ఐఆర్‌లో కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని పిలుపు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజలను మోసం చేశాయని విమర్శ



హైదరాబాద్, జూన్ 28(అక్షరంన్యూస్) తెలంగాణలో ప్రతి బూత్‌ను బలోపేతం చేసి రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. హైదరాబాద్

➤ మిగతా 2వ పేజిలో..

## రేపటి నుంచి ఏరోమార్ట్ సదస్సు

25 దేశాల నుంచి ప్రతినిధుల రాక

హైదరాబాద్, జూన్ 28 విమానయానం, రక్షణ రంగాల్లో దిగ్గజ కంపెనీలు హైదరాబాద్ వేదికగా సమావేశం కానున్నాయి. దీనికి సంబంధించి జూన్ 30 నుంచి జూలై 2 వరకు మూడు రోజుల పాటు హైదరాబాద్ హెచ్ఐసీసీలో "ఏరో మార్ట్ హైదరాబాద్ 2026" పేరుతో అంతర్జాతీయ సదస్సు జరగనుంది. విదేశీ కంపెనీలు, వాటికి విడిభాగాలు సరఫరా చేసే భారతీయ సంస్థలు ఇక్కడ కలుసుకుని కొత్త వ్యాపార ఒప్పందాలు చేసుకుంటాయని సంబంధిత అధికారులు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సదస్సుకు 25 దేశాల నుంచి 400కు పైగా కంపెనీలు, 1,200 మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. భారత్ ప్రపంచంలో విమానయాన తయారీ రంగంలో వేగంగా ఎదుగుతున్న దేశాల్లో ఒకటిగా మారింది. అందుకనుగుణంగానే కేంద్ర ప్రభుత్వం "ఆత్మ నిర్భర్ భారత్" పేరుతో దేశీయంగా ఉత్పత్తి రంగాన్ని విస్తృత పర్చేందుకు చర్యలు తీసుకుంటోంది. రక్షణ సామగ్రిని ఎక్కువగా దేశంలోనే తయారుచేయడం, విమానయాన రంగం విస్తరించడం, ఎగుమతులు పెరగడం వంటి కారణాలతో విదేశీ కంపెనీలు తమ ఉత్పత్తుల కోసం భారతీయ సంస్థలవైపు చూస్తున్నాయి.

# ప్రజలకే ప్రాధాన్యం.. అభివృద్ధికే పెద్దపీట

చేస్తామని పేర్కొన్నారు. నల్గొండ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ప్రజలు కోరిన ప్రతి పనిని పూర్తి చేసేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. గత 30 నెలల ప్రజా ప్రభుత్వ పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. లక్షలాది కొత్త రేషన్ కార్డులు జారీ చేయడంతో పాటు రాష్ట్రంలోని 3.28 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.5 లక్షల ఆర్థిక సహాయం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం రూ.1.56 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేసి, రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఉద్యోగాలు, విద్యా రంగంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలను కూడా సీఎం ప్రస్తావించారు. 30 నెలల్లో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి యువతకు ఉపాధి కల్పించామని, ఎస్సీ వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు కులగణన నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి ఇంటర్ వరకు విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం అందిస్తున్నామని, నైపుణ్యాభివృద్ధికి స్కిల్స్ యూనివర్సిటీ, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం నీలగిరి జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులకు ముఖ్యమంత్రి చెక్కులు పంపిణీ చేశారు. ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు ఆలోచించి తీర్పు ఇవ్వాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# కొత్త వాళ్లకు కీలక శాఖలు!

జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కొత్త జట్టును ప్రకటిస్తారని.. తదనుగుణంగా మోదీ క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని అత్యున్నత స్థాయి బీజేపీ వర్గాలు ఆదివారం వెల్లడించాయి. నితిన్ నబీన్ టీంను పార్టీ అగ్ర నేతలు ఖరారు చేశారని.. కీలక సంస్థాగత పదవుల్లో యువతకు పెద్దపీట వేయనున్నారని తెలిపాయి. నబీన్ గత వారం కొంతమంది కేంద్ర మంత్రులతో మంతనాలు జరిపారు. వీరిలో కొందరిని పార్టీలోకి తీసుకోనున్నారు. పార్టీ ఆఫీసు బేరర్లలో కొందరిని క్యాబినెట్‌లోకి తీసుకుంటారని సదరు వర్గాలు పేర్కొన్నాయి. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ, సీబీఎ?సఈ డిజిటల్ మార్కింగ్ సిస్టమ్‌లో అవకతవకలు మొదలైన వాటి నేపథ్యంలో కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. కొందరు సీనియర్ల శాఖల్లో మార్పుచేర్పులు జరుగవచ్చని అంటున్నారు. కీలక శాఖలకు యువరక్తం ఎక్కించాల్సిన అవసరం ఉందని బీజేపీ అగ్ర నాయకత్వం దృఢంగా భావిస్తున్నట్లు సమాచారం. అంతేగాక రాజకీయ అవసరాల దృష్ట్యా ప్రాంతీ య, రాష్ట్ర, కుల, వర్గాలకు క్యాబినెట్‌లో ప్రాధాన్యమివ్వాలని అనుకుంటోంది. జూలై మూడో వా రంలో పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జరుగనున్నాయి. ఈలోపే పునర్వ్యవస్థీకరణ జరుగుతుందని బీజేపీ వర్గాలు తెలిపాయి. అయితే ప్రధాని మోదీ షెడ్యూల్ చాలా బిజీగా ఉంది. ప్రస్తుతం సీషెల్స్‌లో పర్యటిస్తున్న ఆయన.. జూలై 6–11 తేదీల నడుమ ఇండోనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో పర్యటించాల్సి ఉంది. జూలై 1–3 మధ్య జపాన్ ప్రధాని ఎస్.తకాయిచీ ఢిల్లీలో పర్యటించనున్నారు.

### ఒకరికి ఒకే పదవి..

కేంద్ర మంత్రులు పంకజ్ చౌధురి, హర్ష్ మల్హోత్రాకు ఇప్పటికే యూపీ, ఢిల్లీ పార్టీ పగ్గాలు అప్పగించారు. ఒకరికి ఒకే పదవి అన్న సూత్రం ప్రాతిపదికన పునర్వ్యవస్థీకరణలో వీరికి ఉద్వాసన ఖాయంగా కనిపిస్తోంది. రాజ్యసభ పదవీకాలం ఈ నెల 21న ముగిసినా.. కేంద్ర మంత్రు లు జార్జి కురియన్, రవనీత్‌సింగ్ బిట్టూలకు రెండోసారి అవకాశమివ్వలేదు. దీంతో కురియన్ రాజీనామా చేశారు. పంజాబ్ మాజీ సీఎం సర్దార్ బియాంత్‌సింగ్ మనవడైన బిట్టూ కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నారు. ఆయన 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వచ్చారు. వచ్చే ఏడాది పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. జాట్ తెగకు చెందిన బిట్టూ కీలక నేత కావడంతో ఆయన్ను కేంద్ర మంత్రివర్గంలో కొనసాగించే అవకాశాలే ఎక్కువని ప్రచారం జరుగుతోంది. వచ్చే ఏడాది యూపీ, ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ మూడు రాష్ట్రాల నుంచి కేంద్ర క్యాబినెట్‌లో ఎక్కువ మంది మంత్రులను నియమిస్తారని అంటున్నారు. అలాగే పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం దరిమిలా.. కేంద్ర మంత్రివర్గంలో ఆ రాష్ట్ర ప్రాతినిధ్యం పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా టీఎంసీ, శివసేన(యూబీటీ) రెబెల్స్‌కు చోటు దక్కవచ్చని ప్రచారం జరుగుతోంది. 20మంది టీఎంసీ రెబెల్ ఎంపీలు బెంగాల్లోని నేషనలిస్ట్ సిటిజెన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)లో విలీనమవుతామని ప్రకటించారు. ఆరుగురు యూబీటీ రెబెల్ ఎంపీలు మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే సారథ్యంలోని శివసేనలో విలీనమయ్యారు. ఈ పార్టీ సీనియర్ నేతకు కేంద్ర క్యాబినెట్‌లో చోటు దక్కుతుందని అంటున్నారు. అయితే ఫిరాయింపు నిరోధక చట్టంకింద లోక్‌సభ స్పీకర్ రూలింగ్ ఇచ్చాకే ఈ రెబెల్ ఎంపీలను మంత్రివర్గంలోకి తీసుకోవడంపై తుది నిర్ణయం తీసుకుంటారు. అలాగే పంజాబ్, ఢిల్లీకి చెందిన ఏడుగురు ఆప్ రాజ్యసభ ఎంపీలు బీజేపీలో చేరిన సంగతి తెలిసిందే. వీరిలో ఒకరిద్దరికి మంత్రివర్గంలో స్థానం లభించడం ఖాయమని ప్రచారం జరుగుతోంది. మరో ఇద్దరు కేంద్రమంత్రులు హర్‌ద?పసింగ్ పురీ, బీఎల్ వర్మల రాజ్యసభ పదవీకాలం ఈ ఏడాది నవంబరులో ముగియనుంది. ఇక ముగ్గురు గవర్నర్లు థావర్‌చంద్ గహ్లోత్ (కర్ణాటక), మంగూభాయ్ పటేల్ (మధ్యప్రదేశ్) జూలైలో, లెఫ్టినెంట్ జనరల్ గుర్మీత్‌సింగ్ (ఉత్తరాఖండ్) సెప్టెంబరులో రిటైర్ కానున్నారు. వీరికి కొనసాగింపు ఉంటుందా.. లేక మంత్రివర్గంలోకి తీసుకుంటారా అనేది చూడాలి. కొందరు ప్రస్తుత మంత్రులను గవర్నర్లుగా నియించే అవకాశాలూ ఉన్నాయని బీజేపీ సీనియర్లు చెబుతున్నారు.

# ట్రస్టుకు ముందే తెలుసు!

నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఇంత జరిగినా ట్రస్టు నుంచి ఎలాంటి ఫిర్యాదు పోలీసులకు అందలేదని తెలిపాయి. 5వ తేదీన జరిగిన సోదాలు అనధికారికమని, ఎలాంటి ఎఫ్ఐఆర్ లేకుండానే సోదాలు చేపట్టినట్టు ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఈ నెల 7న విషయం వెలుగు చూసిన తర్వాత.. దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయిందని, దోపిడీ వ్యవహారం ట్రస్టుకు ముందే తెలిసినా ఈ విషయాన్ని గోప్యంగా ఉంచడం వెనుక అనేక అనుమానాలు వస్తున్నాయని పేర్కొన్నాయి. కానీ, ఈ కేసు విషయంలో ట్రస్టు చేసిన జాప్యంపై అధికారులు ఇప్పటి వరకు ప్రశ్నించకపోవడం గమనార్హం. ఇదిలావుంటే, 24 సెకన్ల నిడివి మాత్రమే ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌లో ఓ నల్లటి బ్యాగుతో శుక్లా కనిపించారు. అతని నుంచి స్వాధీనం చేసుకున్న సొమ్ము దానిలో ఉండి ఉంటుందని భావిస్తున్నారు. మరో ఫొటోలో ఇంకోనిందితుడు రామశంకర్ మిశ్రా కూడా ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. ఇక, ప్రత్యేక దర్యాప్తు బృందం అన్ని కోణాల్లోనూ కేసును విచారిస్తోంది. అయోధ్య విరాళాల నిర్వహణలోని లోపాలపై దృష్టి పెట్టింది. నగదు స్వీకరణ, ఉద్యోగుల తనిఖీలు, సీసీటీవీ నిర్వహణ వంటి కీలక విషయాలపై విచారణ సాగుతున్నట్టు అధికారి ఒక రు తెలిపారు. కాగా, ఈ కేసును విచారిస్తున్న సిట్ తన ప్రాథమిక నివేదికను సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు ఆదివారం అందించింది. అదేరోజు వేర్వేరు ప్రాంతాల్లోని ఎనిమిదిమంది నిందితుల ఇళ్లలో ఏకకాలంలో అధికారులు దాడులు చేశారు. కీలక నిందితులు అవినాశ్ శుక్లా, లవ్‌కుశ్ మిశ్రా, రామశంకర్ యాదవ్ సహా అందరి ఇళ్లలోనూ తనిఖీలు చేసినట్టు పోలీసులు తెలిపారు. కాగా, కోర్టు ఈ నెల 29 వరకు నిందితులకు జ్యుడీషియల్ రిమాండ్ విధించిన విషయం తెలిసిందే.

### రాత్రికి రాత్రే కోటీశ్వరులు!

అయోధ్య విరాళాల దోపిడీ వ్యవహారంలో కీలక సూత్రధారి(మాస్టర్ మైండ్)గా భావిస్తున్న అనుకల్ప్ మిశ్రా, ఆయన బావమరిది లవ్‌కుశ్ మిశ్రాలు రాత్రికి రాత్రే రూ.కోట్లకు పగడలెత్తడం ఈ కేసు తీవ్రతను స్పష్టం చేస్తోందని అధికారులు భావిస్తున్నారు. ఆదివారం అనుకల్ప్‌కు చెందిన బసవ గ్రామంలో అధికారులు తనిఖీలు నిర్వహించినప్పుడు విలాసవంతమైన భవనాలను గుర్తించారు. అలాగే వారి ఆర్థిక పరిస్థితులపై కుటుంబీకులు సహా చుట్టుపక్కల వారి నుంచి సమాచారం సేకరించారు. అనుకల్ప్ నిన్నమొన్నటి వరకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇటీవలే భారీ ఎత్తున భవనాలను నిర్మించడంతోపాటు పొలాలు, స్థలాలను కూడా కొనుగోలు చేశారని స్థానికులు తెలిపారు. అయితే, అనుకల్ప్ మంచి వాడేనని చెప్పినట్టు అధికార వర్గాల ద్వారా తెలిసింది. అనుకల్ప్ తాత రాజేంద్రప్రసాద్ ఇచ్చిన సమాచారం మేరకు.. గత ఏప్రిల్ 30న ఏడు రోజుల పాటు భారీ కార్యక్రమం నిర్వహించారు. దీనికి చంపత్‌రాయ్ సహా తీర్థక్షేత్ర ట్రస్టు నుంచి ప్రముఖులు సైతం హాజరయ్యారు. అయితే.. ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించేందుకు అంత సొమ్ము ఎలా వచ్చిందో తనకు తెలియదని పేర్కొన్నారు. ఇక, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనుకల్ప్ ఇటీవలే వ్యవసాయ క్షేత్రాన్ని నిర్మించారు. గత ఏడాది రూ.65 లక్షలు పెట్టి అయోధ్యలో ఇల్లు కొనుగోలు చేశారు. అయితే.. అనుకల్ప్ ఓ బ్యాంకులో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మాత్రమేనని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇంత సొమ్ము ఎక్కడి నుంచి వచ్చిందన్న విషయంపై ఆరా తీస్తున్నారు. ఇదిలావుంటే, లవ్‌కుశ్‌ను అనుకల్పే విరాళాలు లెక్కించే ఉద్యోగంలో చేర్చినట్టు గుర్తించారు. లవ్‌కుశ్ నిన్న మొన్నటి వరకు అద్దె ఇంట్లో ఉండేవారని, తాజాగా ఆయన రూ.లక్షలు ఖరీదు చేసే వాహనాన్ని కొనుగోలు చేసినట్టు రుదౌలీ ప్రాంతానికి చెందిన స్థానికులు అధికారులకు తెలిపారు.

# తెలంగాణలో కమలం

## వికసింపజేద్దాం: కిషన్ రెడ్డి

నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించిన బీజేపీ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణతో భారతీయ జనతా పార్టీకి విడదీయరాని అనుబంధం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దివంగత సుష్మా స్వరాజ్ చేసిన కృషిని గుర్తు చేస్తూ, రాష్ట్ర ప్రజలతో బీజేపీకి ఉన్న బంధం మరింత బలపడుతుందని అన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు చురుకుగా పాల్గొని పారదర్శకత, ఖచ్చితత్వం, సమగ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కిషన్ రెడ్డి కోరారు. ప్రతి అర్హుడైన ఓటరికి ఓటు హక్కు అందేలా కృషి చేయాలని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో 42 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణతో పాటు పలు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు అమలవుతున్నాయని తెలిపారు. తెలంగాణలో కూడా ద్వంద్వ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడితే అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీశాయని, కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని వెనక్కి నెట్టాయని ఆరోపించారు. ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపీలు డి.కె. అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ధర్మపురి అర్వింద్, గోదం నగేశ్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉద్యమకారులందరికీ న్యాయం

డాక్టర్ పిడమర్తి రవి అధ్యక్షతన ఆదివారం తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి జూపల్లి కృష్ణారావు,. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తరువాత కేసీఆర్ రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారులను, ప్రాణ త్యాగం చేసిన వారిని విస్మరించి ఎన్నికల్లో ఓడిపోయిన తన కూతురు కవితకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారన్నారు. బీఆర్ఎస్ ఉద్యమకారులను మోసం చేసిందన్నారు. కేసీఆర్ హయాంలో ఆయన కుటుంబసభ్యులకు మాత్రమే న్యాయం జరిగిందన్నారు. కాంట్రాక్టులను ఆంధ్ర పెట్టుబడిదారులకు అప్పగించి ఆస్తులను పెంచుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడి వివరాలు సేకరించి వారిని గుర్తించేందుకు ఆ కమిటీ పనిచేస్తుందని చెప్పారు. ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వడానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు తెలిపారు.

# కాంగ్రెస్ పాలనలో భూ దందా పెరిగింది

వికారాబాద్, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వికారాబాద్ జిల్లాలో భూ వ్యవహారాలు వివాదాస్పదంగా మారాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. నాడు బీఆర్ఎస్ పాలనలో వికారాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందితే, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని విమర్శించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులపై కూడా కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి సోదరులు తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డి, కృష్ణా రెడ్డి వికారాబాద్ జిల్లాలో పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. నాలుగు దిక్కులా తిరుగుతూ భూములను స్వాధీనం చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారాలపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో రియల్ ఎస్టేట్ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా దెబ్బతీసిందని కేటీఆర్ విమర్శించారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం తగ్గిపోయిందని, భూముల కొనుగోలు, విక్రయాలపై అనిశ్చితి నెలకొన్నదని అన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక, రియల్ ఎస్టేట్ రంగాలకు ప్రోత్సాహం లభించిందని కేటీఆర్ పేర్కొన్నారు. పెట్టుబడులు ఆకర్షించేందుకు పారదర్శక విధానాలు అమలు చేశామని, దాని ఫలితంగానే రాష్ట్ర ఆర్థికాభివృద్ధి వేగంగా జరిగిందని అన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ వైఖరిపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, భవిష్యత్తులో బీఆర్ఎస్ మళ్లీ ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వస్తుందని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై పార్టీ తరఫున నిరంతరం పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే బీఆర్ఎస్ ప్రశ్నిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌తో పాటు పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశంలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన ఉద్యమాలపై చర్చించారు.

# మోదీకి సెషెల్స్ అత్యున్నత గౌరవం



విక్టోరియా (సెషెల్స్), జూన్ 28 : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సెషెల్స్ అత్యున్నత అధ్యక్ష పురస్కారం 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజన్'ను ఆ దేశ అధ్యక్షుడు డాక్టర్ పాట్రిక్ హెర్మినీ ప్రదానం చేశారు. పర్యావరణ పరిరక్షణ, సముద్ర వనరుల సుస్థిర వినియోగం, వాతావరణ మార్పుల నియంత్రణ, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాల కోసం చేసిన కృషికి గుర్తింపుగా ఈ గౌరవాన్ని ప్రధానికి అందజేశారు. భారత--సెషెల్స్ దౌత్య సంబంధాలకు 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ పురస్కారం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ ఈ గౌరవాన్ని కేవలం తన వ్యక్తిగత విజయంగా కాకుండా, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పుల నియంత్రణ కోసం కృషి చేస్తున్న ప్రపంచంలోని అన్ని దేశాలకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి సంరక్షణ, సముద్ర పర్యావరణ పరిరక్షణ ప్రతి దేశం ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు మెరుగైన ప్రపంచాన్ని అందించేందుకు అంతర్జాతీయ సహకారం అవసరమని అభిప్రాయపడ్డారు.

సముద్ర ఆర్థిక వ్యవస్థ (బ్లూ ఎకానమీ) అభివృద్ధి, చిన్న ద్వీప దేశాల అభివృద్ధి ఆకాంక్షలకు భారత్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందని ప్రధాని పేర్కొన్నారు. సముద్ర వనరులను సుస్థిరంగా వినియోగించుకోవడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

భారత్--సెషెల్స్ మధ్య దౌత్య సంబంధాలు ఐదు దశాబ్దాలు పూర్తి చేసుకున్న తరుణంలో ఈ గౌరవం ఇరు దేశాల మధ్య ఉన్న స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని అన్నారు. సముద్ర భద్రత, బ్లూ ఎకానమీ, వాతావరణ చర్యలు, సుస్థిర అభివృద్ధి వంటి రంగాల్లో రెండు దేశాల సహకారం మరింత విస్తరించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సెషెల్స్ ప్రభుత్వం కూడా ప్రధాని మోదీ నాయకత్వాన్ని ప్రశంసించింది. అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాల కోసం అంతర్జాతీయ వేదికలపై భారత్ పోషిస్తున్న పాత్రను కొనియాడింది. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పుల నియంత్రణ, సముద్ర వనరుల సంరక్షణలో మోదీ తీసుకున్న కార్యక్రమాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొంది. ఈ పురస్కారం భారత్‌కు అంతర్జాతీయ స్థాయిలో మరో గౌరవంగా భావిస్తున్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ, బ్లూ ఎకానమీ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భారత్ పోషిస్తున్న పాత్రకు ఇది గుర్తింపని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భారత్--సెషెల్స్ సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ఈ పర్యటన కీలక మైలురాయిగా నిలవనుంది.

# దేశ ప్రగతిలో పీవీ పాత్ర మరువలేనిది

సీఎం రేవంత్ తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో పీవీకి నివాళులర్పించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శాసనసభ లాబీ హాల్లో ఉన్న పీవీ చిత్రపటానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, పీవీ కుమార్తె సురభి వాణీదేవి తదితరులు నివాళులర్పించారు. గాంధీభవన్‌లో పీవీ చిత్రపటానికి టీపీసీసీ ఉపాధ్య క్షుడు కుమార్‌రావు నివాళులర్పించారు. నెక్లెస్‌రోడ్డులోని పీవీ సమాధి వద్ద పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో నాడు ప్రతిపక్ష నాయకుడైనవాజ్‌పేయ్‌ని దేశానికి ప్రాతిని?ధ్యం వహించ డానికి ఐక్యరాజ్యసమితి సదస్సుకు పంపడం ఆయన గొప్పదనమన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, తదితరులు పీవీకి నివాళులర్పించారు.

### పీవీ దూరదృష్టితోనే నేటి సుసంపన్న భారతం

దేశ ఆర్థిక సంస్కరణల శిల్పిగా పీవీ వేసిన పునాదులపైనే నేటి సుసంపన్న భారతం నిలిచిందని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా కొనియాడారు. రవీంద్రభారతిలో పీవీ జయంతి వేడుకలకు హాజరైన ఆయన పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నటుడు, నిర్మాత మురళీమోహన్, పీవీ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డా.ఎన్.వి.సుధాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న నిరుడు సర్వేష్ ముదిరాజ్

- కవితక్క ఆయురారోగ్యాలు, రాజకీయ విజయాల కోసం ప్రత్యేక ప్రార్థనలు.



రంగారెడ్డి జిల్లా :గండిపేట :జూన్ 28: అక్షరం న్యూస్:
తెలంగాణ రక్షక సేన పార్టీ రాజేంద్రనగర్ సీనియర్ నాయకుడు నిరుడు సర్వేష్ ముదిరాజ్ ఆదివారం కుటుంబ సమేతంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, వేద మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో కొంతసేపు గడిపారు. ఈ సందర్భంగా నిరుడు సర్వేష్ ముదిరాజ్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రంలో శాంతి, అభివృద్ధి, సుభిక్షం నెలకొనాలని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే తెలంగాణ రక్షక సేన పార్టీ మరింత బలోపేతం కావాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాసేవలో ముందుండి పనిచేయాలని ఆకాంక్షించారు. అదేవిధంగా కవితక్క ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షుతో ఉండాలని, ఆమె చేపట్టిన ప్రతి కార్యక్రమం విజయవంతం కావాలని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా ఆమె రాజకీయ ప్రస్థానం మరింత బలపడాలని, భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రానికి తొలి మహిళా ముఖ్యమంత్రిగా కవితక్క బాధ్యతలు చేపట్టాలని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని మనస్ఫూర్తిగా వేడుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, మహిళా సాధికారత, రైతుల సంక్షేమం, బలహీన వర్గాల అభ్యున్నతి వంటి అంశాల్లో తెలంగాణ మరింత పురోగతి సాధించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులతో కలిసి స్వామివారి ఆశీస్సులు పొందిన నిరుడు సర్వేష్ ముదిరాజ్, ప్రజలందరికీ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి అనుగ్రహం లభించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పోలియో నుండి మీ పిల్లలను రక్షించండి: ఉప సర్పంచ్ అన్నపూర్ణ నీలకంఠం గౌడ్

రంగారెడ్డి జిల్లా :శంకర్పల్లి :జూన్ 28: అక్షరం న్యూస్ –:



పోలియో నుండి మీ పిల్లలను రక్షించండని బెల్లాల్ గ్రామ సర్పంచ్ రాజు, ఉప సర్పంచ్ అన్నపూర్ణ నీలకంఠం గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు ఉపసర్పంచ్ పోలియో చుక్కలు వేశారు. అనంతరం సర్పంచ్, ఉపసర్పంచ్ అన్నపూర్ణ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య రక్షణ, ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు వారి పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వేదికపై మరో చరిత్ర సృష్టించిన డా. కొప్పుల విజయ్ కుమార్

- మానవతా సేవ, న్యాయ సేవ, సామజిక సేవా రంగాల్లో ఒకేసారి ఏడు వరల్డ్ రికార్డ్స్.




రంగారెడ్డి జిల్లా : శంకర్‌పల్లి: జూన్ 28: (అక్షరం న్యూస్ ): అంతర్జాతీయ అచీవ్‌మెంట్ అవార్డ్స్ కార్యక్రమంలో ఏడు ప్రపంచ రికార్డులు సాధించిన ఘనతకు సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్, న్యాయవాది డా. కొప్పుల విజయ్ కుమార్ ని ప్రముఖులు సత్కరించారు. తమిళనాడులోని హోసూర్ పట్టణంలో న్యాయరంగం, మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక, ప్రజాసేవలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా వివిధ అంతర్జాతీయ సంస్థల నుండి వరుసగా ఏడు ప్రపంచ రికార్డులు లభించడం విశేషం. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ డా. కొప్పుల విజయ్ కుమార్ సాధించిన ఈ అరుదైన ఘనత యువతకు ఆదర్శప్రాయమని, దేశానికి మరియు తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని అభినందించారు. అవార్డులను స్వీకరిస్తూ డా. కొప్పుల విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ గుర్తింపు తన వ్యక్తిగత విజయమే కాకుండా న్యాయం, మానవ హక్కులు, సామాజిక సేవ పట్ల తన నిబద్ధతకు లభించిన గౌరవమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజాసేవలో మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.
"సేవే నా లక్ష్యం... న్యాయమే నా మార్గం... ప్రపంచ గుర్తింపే నా బాధ్యతకు నిదర్శనం." అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసర్చ్ యూనివర్సిటీ ప్రతినిధులు, అమెరికన్ విస్డం పీస్ యూనివర్సిటీ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి





- జిల్లా కలెక్టర్ అంకిత్.
- పల్స్ పోలియో కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్.

భద్రాద్రి కొత్తగూడెం / పాల్వంచ / జూన్ 28 / అక్షరం న్యూస్ –:
ఆదివారం జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా పాల్వంచ మండలం ఇందిరా నగర్ కాలనీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని



లాంఛనంగా ప్రారంభించిన కలెక్టర్, జిల్లాలో ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించకుండా మిగిలిపోకుండా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన చిన్నారులకు ఈ నెల 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లే ఆరోగ్య సిబ్బంది ద్వారా పోలియో చుక్కలు వేయిస్తామని తెలిపారు.ప్రయాణాల్లో ఉన్న కుటుంబాలు బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ఇటుక బట్టీలు, వ్యవసాయ పనులు, నిర్మాణ ప్రదేశాలు, ఇతర పని ప్రదేశాల్లో ఉన్న చిన్నారులకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి ప్రభుత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# ఓటర్ల జాబితా సవరణలో బిఎల్ఏల పాత్ర కీలకం





- అర్హులైన ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత బిఎల్ఏలదే.
- క్షేత్రస్థాయిలో సర్వేలో చురుగ్గా పాల్గొనాలి.
- బోగస్ ఓట్ల తొలగింపుపై ప్రత్యేక నిఘా ఉంచండి.
- కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణపై ప్రజల్లో అవగాహన తేవాలి.
- పార్టీ పటిష్టతకు బూత్ కమిటీలు సమన్వయంతో పనిచేయాలి.
- బిఎల్ఏల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా.

బ ˏ ˇ ( ద ¯ ( ద
కొత్తగూడెం/కొత్తగూడెం / జూన్ 28 / అక్షరం న్యూస్ – : ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్ల (బిఎల్ఏ) పాత్ర అత్యంత కీలకమని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. ఆదివారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరి భవన్'లో నిర్వహించిన లక్ష్మీదేవిపల్లి మండల స్థాయి సిపిఐ పక్ష బూత్ లెవల్ ఏజెంట్ల (బిఎల్ఏ)ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత బిఎల్ఏలదేనని స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వీడి క్షేత్రస్థాయిలో జరిగే సర్వేలో బీఎల్వోలతో కలిసి చురుగ్గా పాల్గొనాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలో బోగస్ ఓట్ల తొలగింపుపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అర్హత లేని వారిని గుర్తించి అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. చనిపోయిన వారు, వలస వెళ్ళిన వారి వివరాలను జాబితా నుండి తొలగించేలా చూడాలని, అర్హులైన యువతీ యువకులకు నూతన ఓటర్ల నమోదు, కార్డుల్లో తప్పుల సవరణపై ప్రజల్లో విస్తృత అవగాహన తేవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బూత్ కమిటీలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ పటిష్టతకు, బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, మండల కార్యదర్శి దీటి లక్ష్మీపతి, జిల్లా సమితి సభ్యులు మామిడాల ధనలక్ష్మి, నాయకులు సపావట్ రవి, జర్పుల ఉపేందర్, కళ్లెం సత్యనారాయణ, హత్తిరమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ప్రజలు సహకరించాలి: శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్



రంగారెడ్డి జిల్లా : శంకర్‌పల్లి: జూన్ 28: (అక్షరం న్యూస్ ): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకుప్రజలు సహకరించాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్ అన్నారు. ఆదివారం పట్టణ పరిధి అన్ని వార్డుల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ చేపట్టారు. ఫారాల పంపిణీ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి కమిషనర్ సూచించారు.అర్హులైన ప్రతి ఓటరు వివరాలు ఓటర్ల జాబితాలో సక్రమంగా నమోదు అయ్యేలా అధి కారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆదే శించారు. కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ, చిరునామా మార్పులు, తొలగింపులు వంటి అంశాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్యూమరేషన్ సిబ్బందికి అవసరమైన సమాచారం, పత్రాలను అందజేసి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బూత్ లెవెల్ ఆఫీసర్ వీరకుమార్ ఉన్నారు.

## తాటి చెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి తీవ్ర గాయాలు



జనగామ జిల్లా/రఘునాథపల్లి/(అక్షరం న్యూస్)జూన్ 28: ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి తీవ్ర గాయలైన సంఘటన మండలం లోని ఖిలాషాపూర్ లో ఆదివారం చోటు చేసుకుంది. దూడల ఉపేందర్ కల్లు తీసేందుకు తాటి చెట్టును ఎక్కుతున్న క్రమంలో నడుముకు ఉన్న మోకు జారడంతో తాటి చెట్టు పైనుంచి కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో జిల్లా ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కు తరలించారు.

## అపోహలు వీడండి.. నేత్రదానానికి ముందుకు రండి..!

- పిలుపునిచ్చిన సదాశయ ఫౌండేషన్ పెద్దపల్లి జిల్లా సలహాదారులు తడబోయిన రాములు
- సంస్మరణ సభలో నేత్రదాతకు ఘన నివాళి



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 28 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్

మరణించిన తర్వాత కూడా ఇద్దరికి వెలుగు పంచే గొప్ప దానమే నేత్రదానమని, అపోహలను విడిచిపెట్టి ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ జిల్లా గౌరవ సలహాదారు తాడబోయిన రాములు పిలుపునిచ్చారు.మంచిర్యాల జిల్లా మందమర్రి ప్రాంతానికి చెందిన చుక్కల రాజమ్మ (80) ఇటీవల మృతి చెందగా, ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దానం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన సంస్మరణ సభలో రాజమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాడబోయిన రాములు మాట్లాడుతూ, "శరీరం శాశ్వతం కాదు.. కానీ మన నేత్రాలు మరో ఇద్దరి జీవితాల్లో శాశ్వత వెలుగులు నింపగలవు. మరణానంతరం కూడా సమాజానికి ఉపయోగపడే మహోన్నత సేవే నేత్రదానం. అపోహలు, భయాలు పక్కనబెట్టి ప్రతి కుటుంబం ఈ దిశగా ఆలోచించాలి. ఒక నిర్ణయం రెండు కుటుంబాల్లో వెలుగులు నింపుతుంది" అని హృదయాలను కదిలించేలా ప్రసంగించారు. అనంతరం నేత్రదాత కొడుకులు కోడళ్ళు చుక్కల నర్సయ్య-విజయ, సత్తయ్య - వనజ, కుమార్--పద్మ, కుమార్తె అల్లుడు బాణయ్య--భాగ్యలను శాలువాలతో సత్కరించి అభినందన పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కొడంగల్ సభకు తెలంగాణ ఉద్యమకారులు

- సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు



రామగిరి/పెద్దపల్లి జిల్లా, జూన్ 28 (అక్షరం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీ కృతజ్ఞతలు తెలియజేసేందుకు ఆదివారం కొడంగల్‌లో నిర్వహించిన సభకు రామ గిరి ప్రాంతానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో బయలుదేరారు. ఈ సందర్భంగా ఉద్యమ నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేయడం కోసం కొడంగల్ సభకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొని తమ కృతజ్ఞత భావాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా విభాగ అధ్యక్షురాలు జ్యోతి రెడ్డి, తెలంగాణ తొలి--మలి--చివరి దశ ఉద్యమకారుడు, తెలంగాణ ఉద్యమ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్టీరింగ్ కమిటీ కన్వీనర్ నూనె రాజేశం, తెలంగాణ ఉద్యమ ఫోరం రాష్ట్ర కార్యదర్శి బత్తుల శంకర్, పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జునుగారి సుధాకర్, కమాన్‌పూర్ మండల అధ్యక్షుడు దాసరి రామస్వామి, మండల కార్యదర్శి ఆవునూరి నర్సయ్యతో పాటు పలువురు తెలంగాణ ఉద్యమ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 33వ డివిజన్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ విజయవంతం



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 28 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్

రామగుండం ఎమ్మెల్యే మకాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గారి ఆదేశాల మేరకు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహాకాళి స్వామి సూచనలతో, 33వ డివిజన్ కార్పొరేటర్ మెరుగు భూలక్ష్మి లింగమూర్తి ఆధ్వర్యంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి మ్యాపింగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ), బూత్ స్థాయి ప్రతినిధుల (బీఎల్ఏ) ఇన్‌చార్జి శంకర్ గారు పాల్గొని, మొత్తం 50 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన మ్యాపింగ్ ప్రక్రియను పూర్తిచేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### భామ్లు నాయక్ తండాలో వైభవంగా

# శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయ భూమి పూజ






జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 28 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: పెద్దపల్లి జిల్లా కన్నాల గ్రామ పరిధిలోని భామ్లు నాయక్ తండాలో శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి శనివారం శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. మాజీ ఉపసర్పంచ్ జ్యోతి శంకర్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు, డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నాయకుడు ఆలకుంట రాజేశం ముఖ్య అ తి ధ ; ు ల ు గా వ ే జ ర య్యా ర ు . వే ద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ శ్రీ సేవాలాల్ మహారాజ్ చూపిన సేవా భావం, నైతిక విలువలు, సామాజిక సమానత్వం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. తండా ప్రజల చిరకాల కోరికైన ఆలయ నిర్మాణం విజయవంతంగా పూర్తై భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు.యూత్ కాంగ్రెస్ నాయకుడు ఆలకుంట రాజేశం తండా యువతతో సమావేశమై ఆలయ నిర్మాణ వివరాలను తెలుసుకున్నారు. తండా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో దొబ్బల తరుణ్, పాలకుర్తి యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ దండుగుల శ్రీకాంత్, దండుగుల రఘు, బానోతు కార్తీక్, అలకుంట శ్రీనివాస్, అలకుంట రాకేష్, తండా కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# పల్స్ పోలియో కేంద్రం ప్రారంభించిన రామగుండం మేయర్





జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 28 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రులు బాధ్యతగా తీసుకోవాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 51 వ డివిజన్ ఆశోక్ నగర్ ప్రభుత్వ బాలికల పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో ఆదివారం ఉదయం డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య తో కలిసి పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పోలియో మహమ్మారి నుంచి పిల్లలను కాపాడుకోవడానికి ఎక్కడ ఉన్నా పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని అన్నారు.రెండు రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఆకారపు రేఖా మహేష్, వైద్యులు స్నేహలత, మెప్మా సి ఓ శ్వేత, ఆర్ పి లు, ఇతర వైద్య సిబ్బంది



పాల్గొన్నారు.

## 50 వ డివిజన్లో పోలియో చుక్కల కేంద్రం ప్రారంభం




జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 28 పెద్దపల్లి జిల్లా అక్షర నస్

తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆదివారం భాగంగా రామగుండం నగరపాలక సంస్థ 50వ డివిజన్‌లో పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు 50వ డివిజన్ కార్పొరేటర్ ధూళికట్ట సతీష్ పల్స్ పోలియో బూత్‌లను సందర్శించి కార్యక్రమాన్ని పరిశీలించారు. యూపీహెచ్‌సీ అడ్డగుంటపల్లి పరిధిలోని అశోక్‌నగర్ రెయిన్‌బో స్కూల్‌లో ఏర్పాటు చేసిన బూత్‌తో పాటు, యూపీహెచ్‌సీ లక్ష్మీపురం పరిధిలోని గాంధీనగర్ లేబర్ కోర్టు సమీపంలోని పోలియో బూత్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొని సేవలందించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ ధూళికట్ట సతీష్ మాట్లాడుతూ, పోలియో రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రజలకు సేవలందిస్తున్న ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని అభినందించారు.50వ డివిజన్ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని ఆయన కోరారు.

## రెండు చుక్కలు -- జీవితకాల రక్షణ" నినాదంతో 21వ డివిజన్‌లో పల్స్ పోలియో కార్యక్రమం




జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 28 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం నగరపాలక సంస్థ 21వ డివిజన్ పరిధిలోని లక్ష్మీపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ మానికేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి 21వ డివిజన్ కార్పొరేటర్ కందుల స్వరూప సతీష్ ముఖ్య అతిథిగా హాజరై ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ కందుల స్వరూప సతీష్ మాట్లాడుతూ, "పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి. ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత పోలియో టీకా అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి" అని పిలుపునిచ్చారు.

"ఒక్క బిడ్డ కూడా మిస్ కాకూడదు" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు విశేషంగా సహకరించారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని, ఇంటింటికీ వచ్చే వైద్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని నిర్వాహకులు కోరారు.

ఈ కార్యక్రమంలో సముదాయ నిర్వాహకురాలు పారిజాతం, ఆరోగ్య కార్యకర్త అనూష, బండి సాయి, యాదన్న, పెద్ద మల్లేశం, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్



శేరిలింగంపల్లి అక్షరం ప్రతినిధి: కొండాపూర్ డివిజన్‌లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణ ప్రతి కుటుంబం బాధ్యత అని, ప్రభుత్వం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలియో అనేది చిన్నారుల్లో శాశ్వత అంగవైకల్యానికి దారితీసే ప్రమాదకర వైరస్ వ్యాధి. అయితే, సమయానికి పోలియో చుక్కలు వేయించడం ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చు. అందుకే ప్రభుత్వం ప్రతి సంవత్సరం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఐదేళ్లలోపు పిల్లలందరికీ ఉచితంగా పోలియో చుక్కలను అందిస్తోంది. పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలంటే ప్రతి తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ తో బాటుగా సీనియర్ నాయకులు యన్. రూపారెడ్డి, జే. బలరాం యాదవ్, డా. రమేష్ గౌడ్, తిరుపతి యాదవ్, తోట వెంకటరమణ, మోదుగు ప్రసాద్ రావు, పుణ్యవతి, గిరి గౌడ్, కేశం కుమార్ ముదిరాజ్, సత్తిబాబు, నీలం లక్ష్మి నారాయణ ముదిరాజ్, నీలం లక్ష్మణ్ ముదిరాజ్, సయ్యద్ ఖాసీం, నాగరాజు, నరేష్, విజయ్, జహంగీర్, రఫియా బేగం, ప్రభాకర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నిండు ప్రాణానికి రెండు చుక్కలు

- **పల్స్ పోలియో కార్యక్రమంలో షేక్ చాంద్ పాషా**



శేరిలింగంపల్లి అక్షరం ప్రతినిధి: కొండాపూర్ డివిజన్ శ్రీరామ్ నగర్ కాలనీలోని శ్రీ రామ హై స్కూల్‌లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ చాంద్ పాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి, వారి ఆరోగ్య పరిరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి అందరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

## రామగుండం రైల్వే స్టేషన్‌లో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం

- **250 మందికి పైగా చిన్నారులకు పోలియో చుక్కలు**




జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 28 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:
జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం రామగుండం రైల్వే స్టేషన్‌లో ప్రత్యేకంగా నిర్వహించిన పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంలో 250 మందికి పైగా ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

ఈ కార్యక్రమంలో డివిజనల్ రైల్వే మెంబర్ అనుమాస శ్రీనివాస్, రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి, మెడికల్ సిబ్బంది లక్ష్మి, సుమలత పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు అందించారు.

ఈ సందర్భంగా వారు తల్లిదండ్రులకు పోలియో నివారణ టీకాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని అవగాహన కల్పించారు. కార్యక్రమం విజయవంతంగా ముగియగా, తల్లిదండ్రులు, రైల్వే ప్రయాణికులు సహకరించినందుకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# మాదిగలకు రాజ్యాధికారమే మాదిగ మహాశక్తి లక్ష్యం




- **అసంపల్లి శ్రీనివాస్**

జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 28 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్: మాదిగలకు రాజ్యాధికారమే మాదిగ మహాశక్తి ప్రధాన లక్ష్యమని, ఎన్నికల సమయంలో మాత్రమే మాదిగలను రాజకీయ పార్టీలు కవచంగా ఉపయోగించుకుని, అధికారంలో మాత్రం తగిన ప్రాధాన్యం కల్పించడం లేదని మాదిగ మహాశక్తి రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు అసంపల్లి శ్రీనివాస్ (వాసు) అన్నారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీ శ్రీమయి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో మాదిగ మహాశక్తి ఆధ్వర్యంలో నియోజకవర్గ మాదిగ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. మహాశక్తి ముఖ్య నేత మడిపల్లి మల్లేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, రాజకీయ అధికారంలో మాదిగలకు న్యాయమైన వాటా దక్కే వరకు ఉద్యమం కొనసాగిస్తామని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల్లో మాదిగలకు అధిక సంఖ్యలో పోటీ చేసే అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం మాదిగ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. షెడ్యూల్డ్ కులాల జనాభాలో మాదిగలు కీలక వర్గమైనప్పటికీ, ఉన్నత రాజకీయ పదవుల విషయంలో వారికి అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగ మహాశక్తి ద్వారా ఉద్యమ స్ఫూర్తిని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి మాదిగ సమాజానికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం దక్కలేదని పేర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ నుంచి మాదిగ అభ్యర్థి విజయం సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

"మన ఓటు మనకే" అనే నినాదంతో మాదిగ సమాజం ఒక్కతాటిపైకి రావాలని, మాదిగల గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ప్రతిఘటించాలని సూచించారు. మాదిగల ఆత్మగౌరవం, రాజకీయ సాధికారత కోసం పనిచేస్తున్న మాదిగ మహాశక్తికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంజపూరి పులిందర్, కార్పొరేటర్ కర్రావుల డేవిడ్ రాజ్, పెద్దెల్లి ప్రకాష్, న్యాతరి రాయమల్లు, బూడిద మహేందర్, జూల లింగయ్య, విజయ్ కుమార్, పర్లపల్లి బాబు, పుట్ట సదానందం, రాజ్ గోపాల్, భాగ్యలక్ష్మి, కనకం మహేందర్, కుక్క గంగప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు

## జాతీయ పల్స్ పోలియోకు విశేష స్పందన.. 95 శాతం లక్ష్యం పూర్తి





సూర్యాపేట /నేరేడుచెర్ల, జూన్ 28( అక్షరం న్యూస్ )
జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం నేరేడుచెర్ల మండలంలోని వివిధ పోలియో కేంద్రాల్లో 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభించగా, మండలంలో 95 శాతం లక్ష్యాన్ని అధికారులు పూర్తి చేశారు.

నేరేడుచెర్ల మండలంలో మొత్తం 1,379 మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉండగా, వారిలో 1,309 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం ద్వారా 95 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు మండల వైద్యాధికారి డా. పున్న నాగిని తెలిపారు. ఇంకా పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులకు సోమవారం వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని ఆమె చెప్పారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, ఏ ఒక్క చిన్నారి కూడా ఈ కార్యక్రమానికి దూరం కాకుండా తల్లిదండ్రులు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేశారు. అధికారులు పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు.




### ప్రభుత్వ భూముల్లో గుడిసెలు

# వేసుకున్న పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

జూలై 1న కలెక్టర్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

సూర్యాపేట /నేరేడుచర్ల, జూన్ 28 (అక్షరం న్యూస్ )

ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేసి, ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూలై 1న సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టనున్న ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం నేరేడుచర్లలో నిర్వహించిన సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి సుమారు మూడు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ప్రజలు ఆశించిన స్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరగడం లేదని ఆయన విమర్శించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇటీవల వరంగల్ జిల్లాలోని గుండ్ల సింగారం గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో వేలాది మంది గుడిసెలు వేసుకోగా, ప్రభుత్వం బుల్డోజర్లతో వాటిని కూల్చివేయడమే కాకుండా, జాతీయ నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి పేరుతో నిర్మించిన సీపీఐ పార్టీ కార్యాలయాన్ని కూడా నేలమట్టం చేయడం బాధాకరమని పేర్కొన్నారు. బాధితులందరికీ వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వడంతో పాటు, పార్టీ కార్యాలయాన్ని తిరిగి నిర్మించి సీపీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని, వితంతువులు, దివ్యాంగులు తదితర లబ్ధిదారులకు ఎన్నికల హామీ మేరకు సంక్షేమ పథకాల ప్రయోజనాలను పెంచాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ. లక్ష్మి, ఏఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు పరికె భరత్ తదితరులు పాల్గొన్నారు.




# నవ సమాజానికి సామాజిక విపత్తు!

- వ్యవస్థపై నమ్మకం కోల్పోతున్న యువత.
- డిగ్రీలు చేతిలో.. నిరాశ గుండెల్లో..
- దారి తప్పుతున్న యువశక్తి.

పెద్దపల్లి జిల్లా / సుల్తానాబాద్,/ జూన్ 28 / అక్షరం న్యూస్ ప్రతినిధి,
(మహమ్మద్ యూసుఫ్ అలీ )

ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి కలిగిన దేశం మనదే. దేశ భవిష్యత్తును మార్చగల సత్తా గల ఈ యువ శక్తే నేడు నిరాశ, నిస్పృహల ఊబిలో కూరుకుపోతోంది. ఒకవైపు అద్భుతమైన ప్రతిభ ఉన్నా, మరోవైపు తగిన అవకాశాలు లేక, భవిష్యత్తుపై భరోసా కరువై యువత అసాంఘిక శక్తుల వైపు, హింసాత్మక మార్గాల వైపు, చివరకు మత్తు పదార్థాల బానిసత్వంలోకి జారిపోతోంది.ఎన్నికల సమయాల్లో యువతను కేవలం ఓటు బ్యాంకులా ఉపయోగించుకుని, ఎన్నికల తర్వాత వీరికి ఎలాంటి జీవన దారి చూపక పోవడమే మన పాలకులు చేస్తున్న తప్పు. ఎటు వెళ్లినా ఉద్యోగ అవకాశాలు లేకపోవడం, పెరిగిన జీవన వ్యయంతో మానసిక ఒత్తిడి తీవ్రమవ్వడం వల్ల యువత నిరుత్సాహానికి గురవుతున్నారు. జీవించాల్సిన జీవితాన్ని ఏదోలా గడిపేస్తే చాలు అనే ధోరణికి అలవాటు పడిపోతున్నారు.ఇటీవల జరుగుతున్న పరిణామాలు చూస్తే.. యువతకు ప్రాణం మీద తీపి పోతోందని, వారు మన సమాజం, వ్యవస్థ, విధానాల పట్ల నమ్మకాన్ని పూర్తిగా కోల్పోతున్నారని అర్థమవుతోంది. రేయింబవళ్లు కోచింగ్ తీసుకుని ప్రిపేర్ అయిన విద్యార్థుల మనోవేదనకు ఓదార్పు లేదు. ఇటు పాలక పక్షంతో పాటు ప్రతిపక్షం కూడా యువత వేదనను అర్థం చేసుకోవడం లేదు. ఈ విషయంలో ప్రతిపక్ష నేతలు పాలను గట్టిగా నిలదీయలేకపోతున్నారు. వారి బాధ్యతారాహిత్యం వల్ల వారే అసలు దోషులుగా చిత్రీకరించబడుతున్నారు. చదువు పూర్తి చేసి, డిగ్రీలు చేతపట్టుకుని ఏళ్ల తరబడి నోటిఫికేషన్ల కోసం




ఎదురుచూడటం మన దేశంలో సర్వసాధారణంగా మారింది. గ్రామీణ యువతకు స్థానికంగానే ఉపాధి దొరికే మార్గాలపై పాలను దార్శనికత లోపిస్తోంది. మారుతున్న కాలంతో పాటు జీవన వ్యయం విపరీతంగా పెరిగిపోయింది. రూమ్ అద్దెలు, కనీస అవసరాలు, కోచింగ్ సెంటర్ల ఫీజులు మధ్యతరగతి, పేద యువతపై మానసిక భారాన్ని పెంచుతున్నాయి. తల్లిదండ్రుల కష్టాన్ని చూస్తూ, తాము వారికి ఆర్థికంగా ఆసరా కాలేకపోతున్నామనే గిల్ట్ యువతను తీవ్రమైన డిప్రెషన్‌లోకి నెట్టేస్తోంది. ఫలితంగా వ్యవస్థపై హేయభావన పెరుగుతోంది. ఆర్థిక ఒత్తిళ్లే యువతను త్వరగా డబ్బు సంపాదించాలని నెపం తో తప్పుడు మార్గాల వైపు ప్రేరేపిస్తున్నాయి. వ్యవస్థ నుండి ఎలాంటి మద్దతు లభించనప్పుడు, వారిలో సమాజంపై, పాలనా వ్యవస్థలపై విరక్తి, కోపం పెరగడం సహజం. సామాజిక అసమానతలు, భూసమస్యలు, స్థానిక వనరుల దోపిడీ వంటి అంశాలను ఆసరాగా చేసుకుని కొన్ని శక్తులు యువతలోని ఈ నిరాశను, కోపాన్ని పెట్టుబడిగా మార్చుకుంటున్నాయి. వ్యవస్థపై ఉన్న కసిని హింస వైపు మళ్లించి, వారిని నేర మార్గాల్లోకి లాగుతున్నాయి. ఉద్యోగం లేని ఖాళీతనం క్రైమ్ నెట్‌వర్క్‌లకు సులభమైన వనరుగా మారుతోంది. సైబర్ నేరాలు, ఈజీ మనీ దందా, స్థానిక గ్యాంగ్‌లలో యువత చేరడానికి ఈ నిరాశే మూలకారణం. ఆర్థిక, సామాజిక సమస్యల నుండి తాత్కాలికంగా తప్పించుకోవడానికి చాలామంది యువకులు డ్రగ్స్, గంజాయి, మద్యానికి బానిసవుతున్నారు. మొదట ఒత్తిడిని మరువడానికి ప్రారంభించే ఈ అలవాటు, ఆ తర్వాత వారి జీవితాలను పూర్తిగా చీకట్లోకి నెట్టేస్తోంది. మత్తు పదార్థాల కొనుగోలు కోసం దొంగతనాలు, దోపిడీలకు కూడా వెనుకాడనంతగా యువత మానసిక స్థితి దిగజారిపోతోంది. ఇది కేవలం ఒక వ్యక్తి సమస్య కాదు, ఒక తరం నాశనమైపోయే సామాజిక విపత్తు.ప్రభుత్వాలు ఇప్పటికైనా కేవలం ఎన్నికల హామీలకే పరిమితం కాకుండా, యువత సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఉద్యోగ నోటిఫికేషన్లు, పరీక్షల నిర్వహణ, ఫలితాల విడుదల ఒక నిర్దిష్ట కాల పట్టిక ప్రకారం జరగాలి. పేపర్ లీకేజీలు, కోర్టు స్టేల వల్ల అభ్యర్థుల వయస్సు, ఉత్సాహం ఉడిగిపోకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. నిరాశలో ఉన్న యువతకు 'మేమున్నామనే' నమ్మకాన్ని, మానసిక స్థైర్యాన్ని వ్యవస్థ కల్పించాలి.యువత బాట తప్పితే దేశం గమ్యం తప్పుతుంది. వారిలో పెరుగుతున్న నిరుత్సాహం దేశ భద్రతకు, ప్రగతికి గొడ్డలి పెట్టు. ప్రభుత్వాలు, ప్రణాళికాకర్తలు ఇప్పటికైనా తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, యువత ఉపాధి, మానసిక స్థైర్యంపై దీర్ఘకాలిక వ్యూహాలతో పనిచేయాలి. యువశక్తికి సరైన దిశను చూపించినప్పుడే నవసమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

## అంజయ్య నగర్ స్మశాన వాటిక టెండర్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గాంధీ ని కోరిన ఆంజనేయులు సాగర్



శేరిలింగంపల్లి అక్షరం ప్రతినిధి: అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ బస్తీలో ఉన్న స్మశాన వాటిక అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, అలాగే ప్రజలకు తాగునీటి సరఫరా మెరుగుపరిచేందుకు బూస్టర్ మోటార్ ఏర్పాటు చేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ని అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ కలిసి వినతిపత్రం అందజేశారు.బూస్టర్ మోటార్ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే అధికారులకు వినతిపత్రం అందజేసిన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, స్మశాన వాటిక టెండర్ ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడంతో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి పనులను వేగవంతం చేయాలని కోరారు. అలాగే, అంజయ్య నగర్ బస్తిలోని సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఒకసారి ప్రత్యేకంగా సందర్శించాలని ఎమ్మెల్యే ని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో మాట్లాడి టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయించి అభివృద్ధి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజు యాదవ్, కృష్ణ సాగర్, రవి సాగర్, శివ తదితరులు పాల్గొన్నారు.

## బేగంపేటలో విజయవంతంగా పోలియో చుక్కల కార్యక్రమం



రామగిరి, పెద్దపల్లి జిల్లా, జూన్ 28 (అక్షరం న్యూస్): రామగిరి మండలం బేగంపేట గ్రామంలో ఆదివారం నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతంగా జరిగింది. గ్రామంలోని 0 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంతెన చంటి, ఉప సర్పంచ్ సందేల రేణుక కుమార్ పాల్గొని ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలంటే ప్రతి చిన్నారికి సమయానికి పోలియో చుక్కలు వేయించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

## పోలియో రహిత సమాజమే లక్ష్యం -- మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం...




సూర్యాపేట/ నేరేడుచర్ల /జూన్ (అక్షరం న్యూస్)
జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా మీరు నేరేడుచర్ల లో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేయించే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వనతం చిన్న వెంకటరెడ్డి మాట్లాడుతూ, ఐదు సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొని ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు స్థానిక ప్రజాప్రతినిధులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## జ్యోతి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం -- విశేష స్పందన



సూర్యాపేట /నేరేడుచర్ల, జూన్ 28,(అక్షరం న్యూస్ )
నేరేడుచర్ల పట్టణంలో జ్యోతి హాస్పిటల్స్, మిర్యాలగూడ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ఈ సందర్భంగా ప్రముఖ వైద్యుల బృందం రోగులను పరీక్షించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. శిబిరంలో రక్తపోటు (దీ్రా), ఈసీజీ (జు.జ.+) పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అలాగే గుండె, నరాలు, జీర్ణాశయం, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్ తదితర విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు రోగులను పరీక్షించి చికిత్సకు సంబంధించిన సూచనలు అందించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులు హాజరై మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో జ్యోతి హాస్పిటల్స్ ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ ఇటువంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, సామాజిక కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## బ్లాక్ హెడ్స్ సమస్య ఉన్నవారు ఈ సహజసిద్ధమైన చిట్కాలను పాటించాలి..!

చాలా మంది ఎదుర్కొనే వివిధ రకాల చర్మ సమస్యల్లో బ్లాక్‌హెడ్స్ కూడా ఒకటి. ఇది చాలా సాధారణమైన చర్మ సమస్య అని చెప్పవచ్చు. ఆయిల్ చర్మం ఉన్న వారిలో ఇవి ఎక్కువగా కనిపిస్తాయి. సాధారణంగా ముక్కు, గడ్డం, నుదురు ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. చర్మపు రంధ్రాలు అధిక ఆయిల్, మృత కణాలు, ధూళితో మూసుకుపోయినప్పుడు బ్లాక్‌హెడ్స్ ఏర్పడతాయి. వైట్‌హెడ్స్‌లా కాకుండా బ్లాక్‌హెడ్స్ చర్మం పైభాగంలో ఓపెన్‌గా ఉంటాయి. రంధ్రాల్లో చిక్కుకున్న పదార్థం గాలిలోని ఆక్సిజన్‌తో ప్రతిచర్యకు లోనై నలుపు రంగులోకి మారుతుంది. ఈ పరిస్థితిని వైద్యపరంగా ాఎఅవ అని అంటారు. తీవ్రమైన బ్లాక్‌హెడ్స్ తో బాధపడే వారు తప్పకుండా చర్మ వైద్యులను సంప్రదించాల్సి ఉంటుంది. అయితే కొన్ని సహజ చిట్కాలను ఉపయోగించి కూడా బ్లాక్ హెడ్స్ ను తొలగించుకోవచ్చు. బ్లాక్‌హెడ్స్ ను తగ్గించే కొన్ని సహజ చిట్కాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### తేనె, నిమ్మరసం మాస్క్..

తేనె, నిమ్మకాయ మాస్క్ ను ఉపయోగించి బ్లాక్ హెడ్స్ ను తొలగించుకోవచ్చు. తేనెలో సహజ యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. నిమ్మకాయలో మృదువైన ఎక్స్‌ఫోలియేటింగ్ ఆమ్లాలు ఉంటాయి. ఇవి మృత చర్మ కణాలను తొలగించడంలో సహాయపడతాయి. ఈ మాస్క్ ను తయారు చేసుకోవడానికి ఒక టీ స్పూన్ తేనెలో కొన్ని చుక్కల నిమ్మరసం కలిపి బ్లాక్‌హెడ్స్ ఉన్న ప్రాంతాల్లో సున్నితంగా రాయాలి. దీనిని 10-15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడగాలి. ఈ మాస్క్ చర్మ రంధ్రాలను శుభ్రపరచి ఆయిల్ పేరుకుపోవడాన్ని తగ్గిస్తుంది. అయితే సెన్సిటివ్ స్కిన్ ఉన్నవారు నిమ్మరసాన్ని జాగ్రత్తగా ఉపయోగించాలి. అలాగే ముఖానికి ఆవిరి పట్టడం ద్వారా రంధ్రాల్లో చిక్కుకున్న మలినాలను తొలగిపోతాయి. నీటిని మరిగించి, ముఖానికి సురక్షిత దూరంలో 5 నుంచి 10 నిమిషాలు ఆవిరి తగిలేలా ఉండాలి.

## చిరుత కలకలం.. కొత్తగూడలో భయం!

- ప్రజలనుఅప్రమత్తంచేసిన అధికారులు
- కొత్తగూడ అటవీ శాఖ అధికారి వంశీకృష్ణ



మహబూబాబాద్ జిల్లా/ కొత్తగూడ/ జూన్ 28(అక్షరం న్యూస్ )
కొత్తగూడ మండలం లోని

చిరుతపులి సంచారం స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది. నర్సంపేట, మహబూబాబాద్ జిల్లా లో గూడూరు, కొత్తగూడ ఫారెస్ట్ బీట్లు ఒకదానికొకటి కలిసి ఉండటంతో, చిరుత ఏ క్షణాన ఎటు నుంచి దాడి చేస్తుందోనని ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

తాజాగా ఆదివారం ఉదయం నర్సంపేట డివిజన్, ఖానాపురం మండలంలోని కొత్తూరు ప్రాంతంలో చిరుత సంచరించినట్లు స్థానికులు గుర్తించారు. ఈ పరిణామంతో అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించారు. కొత్తగూడ అటవీ శాఖ అధికారి వంశీకృష్ణ ప్రజలను అప్రమత్తం చేస్తూ కీలక సూచనలు జారీ చేశారు.

గుంజేడు ముసలమ్మ తల్లిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులు అడవి లో కుటుంబ సభ్యులతో కలిసి వంటలు చేసుకుంటారని అత్యంత జాగ్రత్తగా ఉండాలి. పశువులను మేత కోసం అడవిలోకి పంపవద్దని స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో బైక్‌లపై అడవి మార్గాల్లో ప్రయాణించవద్దని హెచ్చరించారు.

చిరుతపులి కదలికలు కనిపిస్తే వెంటనే స్థానిక అటవీ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.చిరుతపులి ఎటువైపు నుంచి దాడి చేస్తుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# అశ్వారావుపేటలో ఘనంగా పల్స్ పోలియో కార్యక్రమం

**•14, 10వ వార్డుల్లో చిన్నారులకు పోలియో చుక్కలు..**
**•పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపు.**




భద్రాద్రి కొత్తగూడెం /అశ్వారావుపేట / జూన్ 28 / అక్షరం న్యూస్ –: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీ 14వ వార్డు, 10వ వార్డుల్లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల్లో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపాలిటీ 14వ వార్డులో కౌన్సిలర్ డా. ఉదయ్ జ్యోతి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. పోలియో నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డా. ప్రసాద్ రావు, కే. నవీన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా, మున్సిపాలిటీ పరిధిలోని ఏఎస్ఆర్ కాలనీ 10వ వార్డులో కౌన్సిలర్ మిండా హరిబాబు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది జ్యోతి, విష్ణు, శాంతకుమారి చిన్నారులకు పోలియో చుక్కలు వేయడంతో పాటు తల్లిదండ్రులకు పోలియో నివారణపై అవగాహన కల్పించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, తల్లిదండ్రులు, కాలనీవాసులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి 68వ జన్మదిన వేడుకలు



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూన్ 28/అక్షరం న్యూస్:– హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి 68వ జన్మదిన వేడుకలు ఆదివారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని ఆయన స్వగృహంలో అభిమానులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రజాసేవ మరింత కాలం కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహకార బ్యాంకు జనరల్ మేనేజర్ రాం రెడ్డి, స్థానిక సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచులు మాడుగుల కొమురయ్య, మంగ రామచంద్రం, గద్ద సమ్మయ్య, శ్రీనివాస్ రెడ్డి, చిట్టెంపెల్లి ఐలయ్యతో పాటు హుస్నాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరంలో 140 మందికి వైద్య పరీక్షలు




జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )జూన్ 28: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెఫ్రాన్ కిడ్నీ సెంటర్, నిర్మల్ మ ల్టీ స్పెషలిటీ హాస్పిటల్ హన్మకొండ వారి సహకాంతో కిడ్నీ వ్యాధుల ఉచిత శిబిరంతో పాటు మాత్రిక సంతాన సాఫల్య కేం ద్రం సహకారంతో సంతాన లేమి ఉచిత మెగా వైద్య శిబిరాలను ఆదివారం నిర్వహించారు. కిడ్నీ వ్యాధుల ఉచిత వైద్య శిబిరంలో వంద మందికి కిడ్నీ పని తీరు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మూడు రోజులకు సరిపోను మందు శీ లను ఉచితంగా అందజేశారు. అలాగే సంతాన లేమి శిబిరంలో 40 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెఫ్రాన్ కిడ్నీ సెంటర్ కిడ్నీ డాక్టర్ రాఘవేంద్ర ప్రదీప్, మాత్రిక సంతాన సాఫల్య కేంద్రం గైనాకలజిస్ట్ శ్రేయ గౌని, లయ న్స్ క్లబ్ సభ్యులు కందుల అనిల్ కుమార్, మంచోజు లక్ష్మీనారయణ, రహీం పాష, రంగోజు ఈశ్వరయ్య, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామిని దర్శించుకున్న అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూన్ 28/అక్షరం న్యూస్:–
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ వీరభద్రస్వామి వారిని వరంగల్ అడిషనల్ కలెక్టర్ శ్రీమతి సంధ్యారాణి ఆదివారం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించగా భద్రకాళి అమ్మవారికి కుంకుమార్చన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం దేవస్థానం తరఫున అడిషనల్ కలెక్టర్‌కు శేషవస్త్రం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పి. కిషన్ రావు ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

# ఏడు గ్రామాలకు “ రైల్వే అండర్ బ్రిడ్జి” కలనెరవేరింది




**నిడిగొండ రైల్వే అండర్ బ్రిడ్జి ప్రారంభం**

జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)జూన్ 28: మండలంలోని నిడిగొండ ఎల్ సీ రైల్వే గేటు నంబర్ 42 వద్ద ఏడాదిన్నర క్రితం ప్రారంభమైన రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికావడంతో ఆర్యూ బీ గుండా వాహనాల రాకపోకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. దీంతో నిడిగొండ, ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్, మాదారం, సోమయ్యకుంట తండా, కిలాషాపురం, చౌడారం తదితర గ్రామల ప్రజలు పదిహేనళ్ల నుండి ఎదురుచూస్తున్న నిరీక్షణకు తెర పడినట్లయింది. అండర్ బ్రిడ్జి నిర్మాణ సమయంలో అధికారుల అంచనా నమోనాకు సరైన స్థలం లేకపోవడంతో కొద్ది రోజులు బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, ఫతేషాపూర్ కు చెందిన గొట్టం భాస్కర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని కొంత పట్టా భూమిని కొందరి సహకారం వల్ల తమ సొంత డబ్బులతో బ్రిడ్జికి సరిపోను భూమిని కొనుగోలు చేసి కంట్రాక్టర్ అప్పగించడంలో కీలక పాత్ర పోషించడం వలన ఆరయూబీ నిర్మాణం ఏడాదిన్నర కాలంలో పూర్తి యిందని ఏడు గ్రామాల రైతులతో పాటు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆర్యూబీ ప్రారంభంతో గేటు కష్టాలు తప్పనున్నాయని రైతులు, విద్యార్థులు, పలువురు బ్రిడ్జి నిర్మాణానికి సహకరించిన వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

**పట్టణంలోని కొంతం వాడకు చెందిన వరాల కొమురయ్యగా గుర్తించిన పోలీసులు.**



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / జూన్ 28 / అక్షరం న్యూస్ –:
పెద్దపల్లి పట్టణంలోని రాజీవ్ రహదారిపై ఆదివారం చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. లారీ టిప్పర్ వాహనం ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనడంతో,ఒక వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు మరియు ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం..పెద్దపల్లి పట్టణంలోని కొంతం వాడకు చెందిన వరాల కొమురయ్య (52) తన ద్విచక్ర వాహనంపై ప్రగతి నగర్ నుండి బస్టాండ్ వైపు వెళ్తున్నారు. అదే సమయంలో కరీంనగర్ నుండి గోదావరిఖని వైపు వెళ్తున్న లారీ టిప్పర్ వాహనం, అయ్యప్ప దేవాలయం ట్రాఫిక్ సిగ్నల్ వద్ద కొమురయ్య ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు కొమురయ్య తలకు బలమైన గాయాలవ్వడంతో, ఆయన అక్కడికక్కడే తుదిశ్వాస విడిచారు. సమాచారం అందుకున్న వెంటనే పెద్దపల్లి పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్ట్‌మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

# వంగర పీహెచ్‌సీ పరిధిలో విజయవంతంగా పల్స్ పోలియో కార్యక్రమం



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూన్ 28/అక్షరం న్యూస్:– జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం హనుమకొండ జిల్లాభీమదేవరపల్లి మండలంలోని వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలో పల్స్ పోలియో బూత్ డే విజయవంతంగా నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని 23 పోలియో బూత్‌లు, ఒక మొబైల్ బృందం ద్వారా ఐదేళ్లలోపు 2,180 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డా. రహ్మాన్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. బూత్‌కు రాలేకపోయిన చిన్నారులకు వచ్చే రెండు రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తామని ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డా. దినేష్, పీహెచ్‌ఎన్ వాణి, హెచ్‌ఈఓ మోహన్, గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


# పెద్దపల్లిలో ఘోర అగ్ని ప్రమాదం లక్ష్మీ మెస్ దగ్ధం



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / జూన్ 28 అక్షరం న్యూస్–:
పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని నారాయణస్వామి నగర్‌లో ఆదివారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికంగా ప్రాచుర్యం పొందిన లక్ష్మీ మెస్ లో ఒక్కసారిగా మంటలు చెలరేగి, హోటల్ పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఆదివారం కావడంతో మెస్ యజమానులు హోటల్‌కు సెలవు ప్రకటించి మూసివేశారు. సాయంత్రం నాలుగున్నర సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ మంటల ధాటికి హోటల్ ముందు ఉన్న కట్టెల పందిరి, రేకుల షెడ్డు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదం జరిగిన సమయంలో హోటల్‌లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. లోపల గ్యాస్ సిలిండర్లు ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయని, భారీ శబ్దాలతో హోటల్‌లోని సామగ్రి అంతా కాలిపోయిందని నిర్వాహకులు తెలిపారు. హోటల్ యజమాని పరమేశ్వర్ మాట్లాడుతూ ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగిందని పేర్కొన్నారు. సుమారు రెండు నుండి మూడు లక్షల రూపాయల వరకు నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పెద్దపల్లి అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలు పక్కనే ఉన్న ఇళ్లకు వ్యాపించకుండా అప్రమత్తమై, సుదీర్ఘ శ్రమ తర్వాత మంటలను అదుపులోకి తెచ్చారు. చుట్టుపక్కల ఇళ్లు దూరంగా ఉండటంతో ప్రమాదం తృటిలో తప్పిందని స్థానికులు తెలిపారు.

# ఓటరు జాబితా తయారీలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

**● జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు “లింగాల”**



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)జూన్ 28: పారదర్శకతతో కూడిన ఓటరు తయరీ జాబితాలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని, మాజీ జెడ్పిటిసి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి అన్నారు. ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) లో భాగంగా మండలంలోని ఇబ్రహీంపూర్ లో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణపై ఆయన నాయకులతో పాటు ప్రజలకు ఆదివారం అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాను సమగ్రంగా పరిశీలించడంతో పాటు 18 సంవత్సరాలు నిండిన కొత్త ఓటర్ల పేర్ల నమోదు. అర్హత లేని వారి పేర్లు, మరణించిన వారి పేర్ల తొలగింపు, ఓటరు వివరాల్లో ఉన్న పొరపాట్ల సవరణ, చిరునామా మార్పుల వంటి అంశాలను సరి చేస్తారని తెలిపారు. ప్రతి అర్హుడైన ఓటరు ...జాబితాలో తన పేరు ఉందో.. లేదో.. తప్పని సరిగా చూసుకోవాలని, అవసరమైన మార్పులు ఉంటే వెంటనే సం బంధిత అధికారులను సంప్రదించి సరిచేసుకోవాలని సూచించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్వచ్ఛమైన, పారదర్శకతతో కూడిన ఓటరు జాబితా తయారీలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పోకల శ్రీనివాస్, ఉప సర్పంచ్ చింత నరేష్, గ్యార నాగరాజు, ఎండి.గౌస్, మేడిపల్లి నరేష్, నూనె ఉప్పలయ్య, కాసర్ల లక్ష్మయ్య, మల్లేష్, దోరగొల్ల పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.



# బీసీల హక్కుల సాధనకు ఐక్యంగా కదలాలి

**-●బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష.**

**●రేపు బీసీల ఆత్మీయ సమావేశం.**

**● ముఖ్య అతిథిగా హాజరుకానున్న జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్.**



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / జూన్ 28 / అక్షరం న్యూస్ –:

దేశ, రాష్ట్ర రాజకీయాల్లో వెనుకబడిన తరగతుల హక్కుల సాధన, భవిష్యత్ కార్యాచరణే ధ్యేయంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బీసీల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ శ్రీమతి దాసరి ఉష వెల్లడించారు. జూన్ 29న ఉదయం 11గంటలకు స్థానిక ఆర్యవైశ్య భవనంలో జరిగే ఈ మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆమె తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆమె ఈ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ సమాజంలో, దేశ జనాభాలో 65 శాతానికి పైగా ఉన్న బీసీలకు అన్ని రాజకీయ పార్టీల్లోనూ తగిన ప్రాధాన్యత దక్కడం లేదని, నిరంతరం చిన్నచూపుకే గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలంతా రాజకీయాలకు అతీతంగా ఏకతాటిపైకి వచ్చి తమ సామాజిక, రాజకీయ సత్తాను చాటాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. చదువుకున్న బీసీ యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కాలన్నారు. రిజర్వేషన్లు సమర్థవంతంగా అమలు కావాలన్నా ఐక్య పోరాటాలే శరణ్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రక్షణగా ఉన్న చట్టాల తరహాలో బీసీల రక్షణకు ఎలాంటి నిర్దిష్ట చట్టాలు లేకపోవడం వల్లే అగ్రవర్ణాల దాడులు, అగాయిత్యాలు విపరీతంగా పెరుగుతున్నాయని శ్రీమతి ఉష ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల నాగర్ కర్నూల్, నల్గొండ జిల్లాల్లో బీసీలపై జరిగిన అమానవీయ ఘటనలే ఇందుకు నిదర్శనమని గుర్తుచేశారు. ఈ రకమైన అణచివేతను అడ్డుకోవడానికి, హక్కుల సాధనకు పెద్దపల్లి వేదికగా జరిగే ఈ సమావేశం ఒక దిక్సూచిగా మారుతుందన్నారు. బీసీల ఐక్యత, సంస్థాగత బలోపేతం, ప్రాంతీయ సమస్యల పరిష్కారమే అజెండాగా సాగే ఈ ఆత్మీయ సమావేశానికి జిల్లాలోని బీసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, మేధావులు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. స్థానిక సమస్యలను జాతీయ నేత జాజుల శ్రీనివాస్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేలా కార్యాచరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో బీసీ జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ కొండి సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి శంకర్, ముఖ్య నాయకులు బిక్షపతి, కె. రమేష్, కలవేణి రవి, ఆసరి రాజయ్య, అబ్దుల్ మాలిక్, శ్రావణ్, అజీమ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఎ

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి : జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం/కొత్తగూడెం/జూన్ 28/ అక్షరం న్యూస్ –:

జూన్ 29వ తేదీ, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, మరియు ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## డ్రైవింగ్ లో ఉంటే.. ఫోన్ లిఫ్ట్ చేయొద్దు ప్లీజ్: శంకర్‌పల్లి పోలీసుల హెచ్చరిక.



ఒరంగారెడ్డి జిల్లా / శంకర్‌పల్లి : జూన్ 28 : (అక్షరం న్యూస్ ): డ్రైవింగ్ లో ఉంటే వానదారులు ఫోన్ లిఫ్ట్ చేయొద్దు ప్లీజ్ అని శంకర్‌పల్లి పోలీసులు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆదివారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని బిడిఎల్ క్రాస్ రోడ్ లో వాహనాలను పోలీసుల తనిఖీ చేశారు. అనంతరం ఎస్సైలు శ్రీశైలం, బేతప్పలు మాట్లాడుతూ చోదకులు వాహనాలు నడుపుతూ సెల్ ఫోన్ వాడటం, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాల్ని అతివేగంగా నడపడం, హెల్మెట్ ధరించకపోవడం.. సీటు బెల్టు పెట్టుకోకపోవడం ట్రాఫిక్ సిగ్నళ్లను పట్టించుకోకుండా వాహనాల్ని నడపొద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

# పోలియో చుక్క ప్రతి చిన్నారికి రక్షణ



**● పోలియో రహిత తెలంగాణ లక్ష్యం.**

**● ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా రెండు చుక్కలు వేయించాలని ప్రభుత్వ విప్ సూచన**

పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / జూన్ 28 / అక్షరం న్యూస్ –:

పోలియో రహిత తెలంగాణే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వైద్యాధికారులు, స్థానిక నాయకులతో కలిసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా విజయ రమణారావు మాట్లాడుతూ, పుట్టిన శిశువుల నుంచి ఐదేళ్లలోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పిల్లల ఆరోగ్యం మనందరి బాధ్యత అని, పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. రెండు పోలియో చుక్కలు చిన్నారులకు జీవితాంతం రక్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లో పోలియో చుక్కల కేంద్రాలను అందుబాటులో ఉంచిందని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచిందని తెలిపారు. ప్రజలందరూ ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం 50 పడకలుగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకలకు విస్తరించి, ఆధునికీకరించి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల వైద్య సేవల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి డా. ప్రమోద్ కుమార్, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, వైస్ చైర్మన్ ముస్కాన్ నాజ్ నయ్యర్, భూతగడ్డ సంపత్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శ్రీధర్, స్థానిక కౌన్సిలర్ కొట్టే స్వరూప, పట్టణ కౌన్సిలర్లు, వైద్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## కొప్పూరులో పల్స్ పోలియోకు శ్రీకారం

**0--5 ఏళ్ల చిన్నారులకు పోలియో చుక్కలు.. తల్లిదండ్రులకు సర్పంచ్ విజ్ఞప్తి..**



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూన్ 28/అక్షరం న్యూస్:–

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గద్ద కుమార్ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా 0 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. రెండు చుక్కలు.. పోలియోకు పూర్తి రక్షణ అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని 0--5 ఏళ్లలోపు పిల్లలను సమీపంలోని పోలియో బూత్‌కు తీసుకువచ్చి చుక్కలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మిర్యాల రాణి రాజు, అంగన్‌వాడీ టీచర్ మణెమ్మ, ఆశ కార్యకర్త కొమ్ముల రాణి, తదితరులు పాల్గొన్నారు.

## పోలియో చుక్కలు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారజోడు రాంబాబు




జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) జూన్ 28: మండలంలో పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతంగా జరిగింది. నిడిగొండలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారజోడు రాంబాబు, రఘునాథపల్లిలో పిహెచ్సీ వైద్యాధికారి స్రవంతి, సర్పం చ్ బొల్లం ఉమారాణి, ఇబ్రహీంపూర్ లో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ రాంబాబు మాట్లాడుతూ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని ఆయన సూచించారు కార్యక్రమంలో నిడిగొండ, ఇబ్రహీంపూర్ సర్పంచ్ లు బొమ్మ వీరస్వామి, పోకల శ్రీనివాస్, సిహెచ్ ఓ రామ్ కి షన్, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాత్రి పూట తినే సమయాన్ని కాస్త మారిస్తే చాలు..

**● ఎంతో మేలు జరుగుతుంది.. వెల్లడించిన సైంటిస్టులు..**

రక్తపోటు, రక్తంలో అధిక చక్కెర స్థాయిలు ప్రస్తుతం చాలా సాధారణ సమస్యలుగా మారాయి. World Health Organization (WHO) ప్రకారం, 2024 నాటికి ప్రపంచవ్యాప్తంగా 30–79 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న సుమారు 1.4 బిలియన్ మంది హైపర్‌టెన్షన్ తో బాధపడుతున్నారని వెల్లడైంది. అలాగే 2022లో దాదాపు 830 మిలియన్ మంది డయాబెటిస్ తో జీవిస్తున్నారని తేలింది. కాబట్టి ఈ రెండు సమస్యలను నియంత్రించడానికి సరైన జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. ఇటీవల చేపట్టిన ఓ కొత్త అధ్యయనం ప్రకారం, నిద్రకు కనీసం మూడు గంటల ముందు తినడం ఆపితే రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు మెరుగుపడే అవకాశం ఉంది. ఈ అధ్యయనం Northwestern University పరిశోధకులు నిర్వహించి, Arteriosclerosis, Thrombosis, and Vascular Biology అనే జర్నల్‌లో ప్రచురించారు.

### కేవలం తినే సమయాన్ని మారిస్తే చాలు..

శరీరం సర్కేడియన్ రిథమ్ అనే సహజ జీవ గడియారాన్ని అనుసరిస్తుంది. ఇది నిద్ర, మెటబాలిజం, గుండె పనితీరు, హార్మోన్ విడుదల వంటి ప్రక్రియలను నియంత్రిస్తుంది. రాత్రి ఆలస్యంగా తినడం వల్ల ఈ వ్యవస్థ దెబ్బతింటుంది. ఎందుకంటే ఆ సమయంలో శరీరం విశ్రాంతి తీసుకుని మరమ్మత్తు పనులు చేయాలి. కానీ తినడం వల్ల జీర్ణక్రియ కొనసాగుతుంది. దీంతో రక్తపోటు పెరగడం, రక్తంలో చక్కెర నియంత్రణ తగ్గడం జరుగుతుంది. ఈ అధ్యయనంలో పాల్గొన్నవారిని నిద్రకు మూడు గంటల ముందు తినడం ఆపమని, లైట్లు తగ్గించాలని, రాత్రి 13 నుంచి 16 గంటల వరకు ఉపవాసం ఉండేలా సూచించారు. కేలరీలు తగ్గించకుండా కేవలం తినే సమయాన్ని మార్చడం ద్వారా గుండె, మెటబాలిక్ ఆరోగ్యం మెరుగుపడుతుందని పరిశోధకులు గుర్తించారు. ముఖ్యంగా మధ్య వయస్సు, వృద్ధులలో ఇది ఎక్కువ ప్రయోజనం చూపించింది. శరీరంలోని సహజ నిద్ర–జాగరణ రిథమ్‌కు అనుగుణంగా ఉపవాస సమయాన్ని అమలు చేస్తే గుండె, మెటబాలిజం, నిద్ర మధ్య సమన్వయం మెరుగుపడి గుండె ఆరోగ్యం కూడా రక్షించబడుతుందని నిపుణులు తెలియజేస్తున్నారు.

### రక్తపోటు, హార్ట్ రేట్‌లలో మెరుగుదల..

ఈ పరిశోధనలో 36 నుంచి 75 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న అధిక బరువు లేదా ఊబకాయం ఉన్న 39 మంది పెద్దలను పాల్గొనేలా చేశారు. వీరికి డయాబెటిస్, గుండె సంబంధిత సమస్యల ప్రమాదం కూడా ఉంది. వీరిని రెండు గ్రూపులుగా విభజించి ఈ పరిశోధనలు చేశారు. ఒక గ్రూపు వారిని రాత్రి 13–16 గంటలు ఉపవాసం ఉండేలా, మరో గ్రూపు వారిని 11–13 గంటలు ఉపవాసం ఉండేలా చూశారు.

## ఏయే అనారోగ్య సమస్యలు ఉన్నవారు చియా విత్తనాలను తీసుకోకూడదు..

చిన్నగా ఉన్నప్పటికీ చియా గింజలు అనేక పోషకాలను కలిగి ఉంటాయి. ఆరోగ్యకరమైన డైట్‌లో భాగంగా వీటిని తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చు. వీటిలో ఒమెగా 3 ఫ్యాటీ ఆమ్లాలు, ఫైబర్, ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. చియా గింజల్లో ఫైబర్ కూడా ఎక్కువగా ఉంటుంది. కనుక వీటిని తీసుకోవడం వల్ల జీర్ణక్రియతో పాటు జీర్ణవ్యవస్థ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. వీటిలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి వాపును తగ్గించడంలో సహాయపడతాయి. చియా గింజలు నీటిని తమ బరువుకు 10–12 రెట్లు వరకు పీల్చుకుంటాయి. కనుక వీటిని తీసుకోవడం వల్ల శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటుంది. అలాగే ఎక్కువసేపు పొట్ట నిండిన భావన కలిగించి బరువు నియంత్రణకు కూడా సహాయపడతాయి.

## జుట్టు రాలే సమస్య ఉన్నవారు ఎలాంటి వైద్య పరీక్షలను చేయించుకోవాలి..?



జుట్టు రాలడం సాధారణంగా సౌందర్య సాధనాలను ఎక్కువగా వాడడం వల్ల జరుగుతుందని చాలా మంది భావించినప్పటికీ, వైద్య నిపుణుల ప్రకారం ఇది శరీరంలో ఉన్న పోషక లోపాలు, హార్మోన్ అసమతుల్యతలు లేదా ఆటోఇమ్యూన్ వ్యాధుల సంకేతంగా ఉండొచ్చు. జుట్టు పలుచబడటం లేదా తరచుగా రాలిపోవడం వంటి సమస్యలు ఉన్నప్పుడు, కొన్ని రక్తపరీక్షలు అసలు కారణాన్ని గుర్తించడంలో సహాయపడతాయని చర్మ వైద్యులు చెబుతున్నారు. జుట్టు రాలే సమస్యతో బాధపడే వారు కొన్ని ముఖ్యమైన ల్యాబ్ పరీక్షలు చేయించుకోవడం మంచిదని వైద్యులు తెలియజేస్తున్నారు. ఈ పరీక్షలు పోషక స్థితి, హార్మోన్ల సమతుల్యత, అలాగే ఇతర అంతర్గత ఆరోగ్య సమస్యలపై కీలక సమాచారం అందిస్తాయి. జుట్టురాలే సమస్యతో బాధపడే వారు చేయించుకోవాల్సిన ముఖ్యమైన పరీక్షల గురించి వైద్యుల మాటల్లో ఇప్పుడు తెలుసుకుందాం.

### సీరమ్ ఫెరిటిన్, విటమిన్ బి12 టెస్టులు..

ఈ పరీక్షల్లో ముఖ్యంగా సీరమ్ ఫెరిటిన్ స్థాయిలను పరిశీలిస్తారు. ఇది శరీరంలో ఐరన్ నిల్వలను తెలియజేస్తుంది. భారతీయుల్లో దీర్ఘకాలంగా జుట్టు రాలడానికి తక్కువ ఫెరిటిన్ ఒక ప్రధాన కారణమని వైద్యులు పేర్కొంటున్నారు. ఐరన్ లోపం వల్ల జుట్టు పెరుగుదల చక్రంలో అంతరాయం ఏర్పడి, హెయిర్ ఫాలికల్స్ ముందుగానే షెడింగ్ దశలోకి వెళ్లే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. అలాగే విటమిన్ బి12 పరీక్ష కూడా అత్యంత ముఖ్యమైనది. ఈ విటమిన్ తక్కువగా ఉంటే తల మొత్తం మీద జుట్టు పలుచబడటం కనిపించవచ్చు. అలాగే చర్మంపై రంగు మార్పులు, తక్కువ వయస్సులోనే జుట్టు తెల్లబడటం వంటి సమస్యలు కూడా కలుగుతాయి. ఇక హార్మోన్ అసమతుల్యతను గుర్తించడానికి ఊుజూూూ స్థాయిలను కూడా కొన్నిసార్లు పరీక్షిస్తారు. ఈ హార్మోన్ స్థాయి ఎక్కువగా ఉంటే మహిళల శరీరంలో పురుష హార్మోన్లు పెరిగినట్లుగా భావిస్తారు. ఇది మొటిమలు పెరగడానికి, జుట్టు పలుచబడడానికి దారితీస్తుందని వైద్యులు తెలియజేస్తున్నారు.

### ఏఎన్ఏ, సీరమ్ కార్టిసాల్ టెస్టులు..

అలాగే జుట్టు రాలడానికి స్పష్టమైన కారణం కనిపించనప్పుడు, ూచీూ (అంటీ-న్యూక్లియర్ యాంటీబాడీ) పరీక్షను సూచిస్తారు. ఈ పరీక్ష ద్వారా ఆటోఇమ్యూన్ వ్యాధులను గుర్తించవచ్చు. ఈ రకాల వ్యాధుల్లో శరీర రోగనిరోధక వ్యవస్థ తానే తన కణజాలాలపై దాడి చేస్తుంది. దీనివల్ల జుట్టు రాలడం, చర్మంపై రంగు మార్పులు వంటి సమస్యలు ఏర్పడవచ్చు. అదే విధంగా, ఒత్తిడి ప్రభావాన్ని అంచనా వేయడానికి సీరమ్ కార్టిసాల్ పరీక్షను కూడా ఉపయోగిస్తారు. స్ట్రెస్ కారణంగా కార్టిసాల్ హార్మోన్ అధికంగా విడుదలవుతుంది. ఇది ఎక్కువకాలం అధిక స్థాయిలో ఉంటే మొటిమలు పెరగడం, జుట్టు పలుచబడటం వంటి సమస్యలు తీవ్రం కావచ్చు.

### సీరమ్ అల్బుమిన్ టెస్టు..

వీటితో పాటు పోషకాహార లోపం కూడా జుట్టు రాలడంలో కీలక పాత్ర పోషిస్తుందని వైద్యులు చెబుతున్నారు. అందుకే సీరమ్ ఆల్బుమిన్ పరీక్ష ద్వారా శరీరంలోని మొత్తం ప్రోటీన్ స్థాయిని పరిశీలిస్తారు. ప్రోటీన్ తక్కువగా తీసుకోవడం లేదా శరీరం సరిగా గ్రహించకపోవడం వల్ల గోర్లు బలహీనపడటం, జుట్టు పలుచబడటం జరుగుతుంది. ఈ పరీక్షలు చేయడం ద్వారా జుట్టు రాలడానికి గల ప్రధాన కారణాన్ని తెలుసుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే ప్రతి రోగికి ఒకే విధమైన పరీక్షలు అవసరం ఉండవని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. దీర్ఘకాలంగా జుట్టు రాలే సమస్య ఉన్నవారు తప్పనిసరిగా నిపుణుడైన చర్మ వైద్యుడిని సంప్రదించి, తమ లక్షణాల ఆధారంగా అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

## వేసవిలో మజ్జిగను ఇలా చేసుకు తాగితే..

వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉంటాయి. సూర్యుడు సైతం తెల్లవారగానే ఆకాశంలో భగభగ మంటూ ప్రత్యక్షమైపోతాడు. ఎండలు మండిపోతాయి. దీంతో శరీరం త్వరగా నిర్జలీకరణకు గురవుతుంది. చెమట రూపంలో శరీరం నుంచి నీరు, అవసరమైన లవణాలు కోల్పోవడం వల్ల తీవ్రమైన అలసటతోపాటు నీరసం కలుగుతాయి. అలాంటి వేళ.. మన శరీరాన్ని చల్లగా, తాజాగా ఉండడానికి ఏదైనా చల్లని పానీయం తాగాలనిపిస్తుంది. దాహాన్ని తీర్చుకోవడానికి చాలా మంది శీతల పానీయాలు, సోడాలు, కృత్రిమ పళ్ల రసాలు తాగుతారు. వాటిలో చక్కెర, రసాయనాలు అధికంగా ఉంటాయి. దీంతో అవి ఆరోగ్యానికి కంటే కీడే ఎక్కువగా చేస్తాయి. వీటిని ప్రత్యామ్నాయంగా మజ్జిగ తాగడం వల్ల చాలా మేలు జరుగుతుందని చెబుతారు. మరి ముఖ్యంగా ఈ వేసవిలో మజ్జిగలో కొద్దిగా పుదీనా, ఇతర మసాలాలు కలపడం వల్ల ఇది మరింత రుచిగా ఆరోగ్యకరంగా ఉంటుంది. పుదీనా మజ్జిగ వేసవి వేడి నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా, అనేక అనారోగ్య సమస్యలను నివారిస్తుంది.

### ఈ పుదీనా మజ్జిగ ఎలా తయారు చేయాలంటే..?

పెరుగు, పుదీనా ఆకులు, కొత్తిమీర ఆకులు, పచ్చి మిరపకాయలు, ధనియాలు, ఇంగువా(కొద్దిగా), ఉప్పు, చల్లటి నీరు

### తయారు చేసే విధానం..

పొయ్యి మీద పాన్ పెట్టాలి. అందులో ఒక టేబుల్ స్పూన్ జీలకర్ర, 3 టేబుల్ స్పూన్ల ధనియాలు వేయాలి. దీనిని బాగా వేయించిన తర్వాత.. చిటికెడు ఇంగువా వేసి వేయించాలి. మిక్సర్ గిన్నెలో, వేయించిన జీలకర్ర, ధనియాల మిశ్రమం, 4 టేబుల్ స్పూన్ల ధనియాల పొడి, ఒక పచ్చిమిర్చి, గుప్పెడు పుదీనా ఆకులు, రుచికి సరిపడా ఉప్పు, అర టేబుల్ స్పూన్ నల్ల ఉప్పు, రెండు టేబుల్ స్పూన్ల పెరుగు వేసి.. వీటిని మెత్తని పేస్ట్‌గా గ్రైండ్ చేసుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక గిన్నెలో దాదాపు పావు కేజీకిపైగా పెరుగు తీసుకోవాలి. అందులో ఇందాక మిక్సిలో వేసిన గ్రైండ్ చేసిన పదార్థాలను అందులో కలుపుకోవాలి. అందులో నాలుగున్నర కప్పుల (ఒక కప్పు పెరుగుకు మూడు కప్పులు) చల్లటి నీటిని పోసి.. బాగా కలపాలి. అంతే పుదీనా మజ్జిగ సిద్ధం.

# వంగరలో ఘనంగా పీవీ నరసింహారావు 105వ జయంతి వేడుకలు






**•ఆర్థిక సంస్కరణల పితామహుడికి స్వగ్రామంలో ఘన నివాళులు**

**•పి.వి ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి..**

**•సీపీ ప్రశాంత్ రెడ్డి.**

హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూన్ 28/అక్షరం న్యూస్:

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో ఆదివారం భారతరత్న, మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణల పితామహుడు స్వర్గీయ పి.వి. నరసింహారావు 105వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పి.వి. నరసింహారావు జంక్షన్ (పి.వి. నగర్ కూడలి) వద్ద నిర్వహించిన కార్యక్రమానికి కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పి.వి. నరసింహారావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న సమయంలో దూరదృష్టితో సంస్కరణలకు శ్రీకారం చుట్టి భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన మహానేతగా పి.వి. నరసింహారావును కొనియాడారు. బహుభాషా కోవిదుడు, మేధావి, దూరదృష్టి కలిగిన రాజకీయ నాయకుడిగా ఆయన చేసిన సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. దేశానికి ప్రధానమంత్రిని అందించిన గడ్డగా వంగర గ్రామం చరిత్రలో నిలిచిందని, పి.వి. ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.వి. మదన్ మోహన్ రావు, సీఐ పులి రమేష్, ఎస్సై దివ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి, స్థానిక సర్పంచ్ గజ్జల సృజన రమేష్, ముల్కనూర్ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు జక్కుల అనిల్, జిల్లా ఉపాధ్యక్షుడు చిట్టెంపెల్లి ఐలయ్య, జిల్లా కార్యదర్శి ఆదరి రవీందర్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిదురాల స్వరూప, మండల నాయకులు ఊస కోయిల ప్రకాష్, ఆర్. వెంకట్ రెడ్డి, మొండయ్య, విద్యార్థులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.




# గోదావరిఖనిలో ‘జీడీకే స్టార్టప్ మైండ్‌సెట్స్’ వేదిక ప్రారంభం

జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 28 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:

స్థానిక యువతలో పారిశ్రామిక ఆలోచనలను ప్రోత్సహించి, స్టార్టప్ సంస్కృతిని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో గోదావరిఖనిలో ‘జీడీకే స్టార్టప్ మైండ్‌సెట్స్’ వేదికను ప్రారంభించారు. యువ పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని పరిచయాలు పెంచుకోవడం, వ్యాపార ఆలోచనలు పంచుకోవడం, పరస్పర సహకారంతో ముందుకు సాగేందుకు ఈ వేదికను ఏర్పాటు చేశారు. తెలంగాణ ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ (టీఐహెచ్‌సీఎల్)లో రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పనితీరు (రాంప్) కార్యక్రమంలో భాగంగా సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు సేవలందిస్తున్న కనకం ప్రశాంత్ తన ఉద్యోగ అనుభవంతో కొత్త పరిశ్రమలు, వ్యాపారాల ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని గుర్తించి, గోదావరిఖనిలో మరింత మంది యువత వ్యాపార రంగంలోకి రావాలనే ఉద్దేశంతో ఈ వేదికను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి థగ్స్ ఆఫ్ జీడీకే అడ్మిన్ మనోజ్ సహకారం అందించగా, కనకం ప్రశాంత్ కూడా థగ్స్ ఆఫ్ జీడీకే నిర్వహిస్తున్న సామాజిక సేవా



కార్యక్రమాలకు తన వంతు మద్దతు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ వేదిక ద్వారా వ్యాపార ఆలోచనలు ఉన్న వారు ఎలాంటి సంకోచం లేకుండా తమ ఆలోచనలను ఒకే ఆలోచన కలిగిన వారితో పంచుకుని, విలువైన సూచనలు, భాగస్వామ్యాలు, సహకారం పొందవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. పోటీ కంటే పరస్పర సహకార భావనను పెంపొందించడమే ఈ వేదిక ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ సమావేశానికి 35 మందికి పైగా యువ పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, వ్యాపారవేత్తలు హాజరయ్యారు. ట్రియో ఇన్ఫో సొల్యూషన్స్, కనక్ బై మౌనిక, నియో--9, అవని ఫార్మ్స్, ఉడుపి హోటల్ ప్రతినిధులతో పాటు సిమ్స్--ఆర్‌జీఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. అశోక్ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు. భవిష్యత్తులో స్థానిక పారిశ్రామికవేత్తలు, బ్యాంకర్లు, ఆర్థిక సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ పరిశ్రమల శాఖ అధికారులతో సమావేశాలు నిర్వహించి యువతకు మార్గదర్శకత్వం, నెట్‌వర్కింగ్ అవకాశాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ ఇంద్రసేన రెడ్డి ప్రోత్సాహం అందించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.



# వేసవిలో కోకుమ్ జ్యూస్ లేదా ఉసిరి కాయ జ్యూస్.. రెండింటిలో దేన్ని తీసుకుంటే ఎక్కువ ఫలితం ఉంటుంది..?



వేసవి వేడి ఎక్కువగా పెరుగుతున్న సమయంలో ప్రజలు శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి అనేక రకాల ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. ముఖ్యంగా శరీరాన్ని చల్లబరిచే పానీయాలను ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. వేసవిలో బయట మార్కెట్ లో లభించే శీతల పానీయాలకు బదులుగా సంప్రదాయ జ్యూస్ లను తీసుకోవడం మంచిది. వేసవిలో తీసుకోదగిన సహజ పానీయాల్లో కోకుమ్ జ్యూస్, ఉసిరి జ్యూస్ లు ముందు వరుసలో ఉంటాయని చెప్పవచ్చు. ప్రజలు కూడా వేసవిలో కోకుమ్ జ్యూస్, ఆమ్లా జ్యూస్ వంటి పానీయాలను ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. ఈ సంప్రదాయ సూపర్‌ఫుడ్స్‌తో తయారయ్యే ఈ జ్యూసులు శరీరానికి లోపల నుంచి చల్లదనం కలిగించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. కోకుమ్ పండ్లు, మొత్తం ఉసిరి కాయలు పోషకాలను అధికంగా కలిగి ఉంటాయి.

### తాజా జ్యూస్‌లను తీసుకోవడం శ్రేయస్కరం..

అయితే ప్రస్తుతం మార్కెట్లో సిరప్స్, పౌడర్ రూపంలో లభిస్తున్న జ్యూసులతో పోలిస్తే తాజా కోల్డ్-ప్రెస్డ్ జ్యూస్ లను తీసుకోవడం ఎక్కువ ప్రయోజనకరమని వైద్యులు చెబుతున్నారు. రెడీమేడ్ జ్యూసుల్లో కృత్రిమ రంగులు, రుచులు, రసాయనాలు ఉండే అవకాశం ఉంది. ఇవి ఆరోగ్య ప్రయోజనాలను తగ్గించవచ్చని కనుక తాజా జ్యూస్ లనే తీసుకునే ప్రయత్నం చేయాలని చెబుతున్నారు. అసలు వేసవిలో జ్యూస్ లను ఎందుకు తీసుకోవాలి.. కోకుమ్, ఉసిరి జ్యూస్ లలో ఏది శరీరానికి మేలు చేస్తుంది.. వంటి విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం. వేసవిలో జీర్ణవ్యవస్థ నెమ్మదిస్తుంది. అందుకే ఆహారాన్ని తక్కువగా తీసుకుంటారు. ఈ సమయంలో కోకుమ్ లేదా ఆమ్లా జ్యూస్ వంటి పానీయాలను తీసుకోవడం వల్ల శరీరానికి నీరు అందుతుంది. అవసరమైన పోషకాలు లభిస్తాయి. శరీరం లోపల నుంచి చల్లగా ఉంటుంది.

### కోకుమ్ జ్యూస్‌తో కలిగే లాభాలు..

ఇక కోకుమ్ జ్యూస్ ను కోకుమ్ పండుతో తయారు చేస్తారు. దీనిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అలాగే దీనిలో ఆంథోసైనిన్లు వంటి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇందులో గార్సినాల్ కూడా ఉంటుంది. ఇది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను, శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. అలాగే దీనిలో హైడ్రాక్సీసిట్రిక్ యాసిడ్ వంటి ఆమ్లాలు కూడా ఉంటాయి. ఇవి జీర్ణశక్తిని మెరుగుపరచడంలో దోహదపడతాయి. అలాగే కొద్ది మొత్తంలో కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు కూడా ఇందులో ఉంటాయి. కోకుమ్ జ్యూస్ జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. వేసవిలో వచ్చే అలసటను తగ్గిస్తుంది.


### ఉసిరికాయ జ్యూస్ అయితే..

ఉసిరి జ్యూస్ కూడా పోషకాలను కలిగి ఉంటుంది. మార్కెట్లో లభించే ప్యాక్డ్ జ్యూసుల్లో ఆమ్లా శాతం తక్కువగా ఉండే అవకాశం ఉంది. కాబట్టి లేబుల్ చూసి తీసుకోవడం మంచిది. తాజా ఆమ్లా జ్యూస్‌లో విటమిన్ సి 600-700 ఎమ్జి వరకు ఉంటుంది. అలాగే పాలీఫెనాల్స్, ఫ్లేవనాయిడ్స్ బలమైన యాంటీ ఆక్సిడెంట్ చర్యను అందిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి నుండి రక్షిస్తాయి. ఇందులో కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్, పొటాషియం వంటి ఖనిజాలు కూడా ఉంటాయి. ఈ జ్యూస్ లో ఉండే అమినో యాసిడ్లు శరీర జీవక్రియకు మద్దతును ఇస్తాయి. ఉసిరి జ్యూస్ లో ఉండే ఫైబర్ జీర్ణక్రియకు మద్దతును ఇస్తుంది. ఇందులో క్యాలరీలు తక్కువగా ఉంటాయి కనుక రోజూ తీసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. ఉసిరి జ్యూస్ రోగనిరోధక శక్తిని పెంచి, శరీరానికి శక్తినిస్తుంది.

### దేన్ని తీసుకోవాలి..

కోకుమ్ జ్యూస్, ఉసిరి జ్యూస్ రెండూ కూడా ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కోకుమ్ జ్యూస్ శరీరాన్ని బాగా చల్లబరుస్తుంది. వేసవిలో వచ్చే జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. జీరా, ఉప్పు కలిపి ఈ జ్యూస్ ను తీసుకోవడం ఇంకా ప్రయోజనకరంగా ఉంటుంది. అదే విధంగా ఆమ్లా జ్యూస్ శరీరాన్ని హైడ్రేట్ చేస్తుంది. కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయపడుతుంది. మెటబాలిజాన్ని మెరుగుపరుస్తుంది. రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. కోకుమ్ జ్యూస్ శరీరాన్ని చల్లగా ఉంచడంలో కొంచెం ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. ఆమ్లా జ్యూస్ మొత్తం ఆరోగ్యానికి ఎక్కువ ప్రయోజనాలను అందిస్తుంది. ఈ రెండు జ్యూసులు కూడా ఆరోగ్యానికి మంచివే. ఏ జ్యూస్ తీసుకోవాలన్నది సొంత నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

# ఈ యోగాసనాలను తరచూ వేస్తుంటే చాలు.. ఎలాంటి జీర్ణ సమస్యలు ఉండవు..



జీర్ణ సమస్యలైన ఉబ్బరం, మలబద్ధకం, నెమ్మదిగా పనిచేసే మెటాబాలిజం ఇవన్నీ ఈ రోజుల్లో చాలా సాధారణంగా మారుతున్నాయి. కూర్చుని పని చేసే జీవనశైలిని కలిగి ఉండడం, ఒత్తిడి, అసమయ భోజనం, జంక్ ఫుడ్ ను ఎక్కువగా తీసుకోవడం వంటివి ఈ సమస్యలకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. చాలా మంది తీసుకునే ఆహారం జీర్ణ ఆరోగ్యాన్ని కాపాడడంలో ముఖ్యమైన పాత్ర పోషించినప్పటికీ, కొన్ని యోగాసనాలు కూడా జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. యోగా రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది. పొత్తికడుపు అవయవాలను ఉత్తేజితం చేస్తుంది. గట్-బ్రెయిన్ కనెక్షన్‌ను సమతుల్యం చేస్తుంది. నిరంతరం యోగా చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడడంతో పాటు గ్యాస్ సమస్య తగ్గుతుంది. మొత్తం పొట్ట ఆరోగ్యానికి యోగా ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. జీర్ణ ఆరోగ్యానికి ఉపయోగపడే యోగాసనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### పవనముక్తాసనం, భుజంగాసనం..

జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే యోగాసనాలల్లో పవనముక్తాసనం ఒకటి. ఈ ఆసనం జీర్ణక్రియను మెరుగుపరచడంలో, గ్యాస్ తగ్గించడంలో ఎంతో ఉపయోగపడుతుంది. ఈ ఆసనం వేయడం కూడా చాలా సులభం. ముందుగా మెత్తపై పడుకోవాలి. ఒక మోకాలు ఛాతీ వైపు తీసుకురావాలి. రెండు చేతులతో పట్టుకుని పొత్తికడుపుకు దగ్గరగా నొక్కాలి. కొన్ని సెకన్లు అలాగే ఉంచి, తర్వాత మరో కాలుతో ఇలాగే చేయాలి. ఈ ఆసనం పొత్తికడుపుపై ఒత్తిడి కలిగించి జీర్ణక్రియను ఉత్తేజితం చేస్తుంది. భుజంగాసనం వేయడం ద్వారా కూడా జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఈ ఆసనం పొత్తికడుపును స్ట్రెచ్ చేసి జీర్ణ అవయవాలను ఉత్తేజితం చేస్తుంది. ఈ ఆసనం వేయడానికి ముందుగా పొట్టపై పడుకోవాలి. తరువాత చేతులను భుజాల దగ్గర ఉంచాలి. మెల్లగా ఛాతీని పైకి లేపి, భుజాలను రిలాక్స్‌గా ఉంచాలి. ఇలా చేయడం వల్ల రక్తప్రసరణను మెరుగుపరచి జీర్ణక్రియకు సహాయం చేస్తుంది.

### అర్ధ మత్స్యేంద్రాసనం, పశ్చిమోత్తానాసనం..

అలాగే అర్ధ మత్స్యేంద్రాసనం కూడా ఎంతో మేలు చేస్తుంది. ఈ ఆసనం వెన్నెముకను మెలిపెడుతూ పొత్తికడుపు అవయవాలకు మసాజ్ లాంటిది ఇస్తుంది. ఈ ఆసనంలో ముందుగా కాళ్లు ముందుకు చాపి కూర్చోవాలి. ఒక కాలును వంచి పాదాన్ని ఎదురుగా ఉన్న తొడ బయట ఉంచాలి. వెన్నెముకను నిటారుగా ఉంచి మొండెంను వంగిన మోకాలి వైపుకు తిప్పాలి. ఈ ఆసనం జీర్ణ గ్రంథులను ఉత్తేజితం చేసి శరీరం నుండి విష పదార్థాలను తొలగించడంలో సహాయపడుతుంది. అదే విధంగా పశ్చిమోత్తానాసనం కూడా జీర్ణక్రియకు ఎంతో మేలు చేస్తుంది. ఈ ఆసనం పొత్తికడుపుపై ఒత్తిడిని కలిగించి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఈ ఆసనం వేయడానికి ముందుగా కాళ్లు చాపి కూర్చోవాలి. తరువాత నడుము భాగం నుండి ముందుకు వంగి పాదాలను తాకడానికి ప్రయత్నించాలి. ఇలా చేయడం వల్ల మలబద్ధకం సమస్య తగ్గుతుంది.

### మలాసనం, ధనురాసనం..


ఇక మలాసనం అనేది లోతైన స్క్వాట్ ఆసనం, బౌల్ మూవ్‌మెంట్‌ను సహజంగా మెరుగుపరుస్తుంది. ఈ ఆసనం వేయడానికి ముందుగా కాళ్లు వెడల్పుగా ఉంచి స్క్వాట్‌లో కూర్చోవాలి. తరువాత చేతులను నమస్కారం ముద్రలో ఉంచాలి. తరువాత మోకాళ్లపై మోచేతులను ఉంచి నొక్కాలి. ఇది పెల్విక్ ప్రాంతంలో రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది. ఆరోగ్యకరమైన ప్రేగు పనితీరుకు తోడ్పడుతుంది. అదే విధంగా ధనురాసనం కూడా జీర్ణ అవయవాలను శక్తివంతంగా ఉత్తేజితం చేస్తుంది. ఈ ఆసనం వేయడానికి పొట్టపై పడుకోవాలి. మోకాళ్లు వంచి కాళ్లను చేతులతో పట్టుకోవాలి. అదే సమయంలో ఛాతీ, తొడలను పైకి లేపి ఉంచాలి. ఇది జీర్ణ గ్రంథులను ఉత్తేజితం చేసి గట్ యాక్టివిటీ పెంచుతుంది. ఈ విధంగా యోగాసనాలు జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహజమైన, ప్రభావవంతమైన మార్గంగా పని చేస్తాయి. అయినప్పటికి ఈ ఆసనాలు వేస్తూనే సరైన ఆహారం తీసుకోవాలి. రోజూ తగినంత నీరు తాగాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఖాళీ కడుపుతో, సరైన మార్గదర్శకత్వంలో యోగా చేయడం మంచిదని, నిరంతరం యోగాసనాలు వేయడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## డయాబెటిస్‌తో మతిమరుపు...

డయాబెటిస్ అనేది పెనుభూతంగా మారిన సంగతి తెలిసిందే. భారతదేశంలోనూ షుగర్ వ్యాధిగ్రస్థుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. కడుపు నిండా ఏది తిందామన్నా రక్తంలో షుగర్ లెవల్స్ ఎక్కడ పెరిగిపోతాయోననే భయం వారిని వెంటాడుతూనే ఉంది. అందుకే భోజనం విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటుంటారు. లెక్కలేసుకుని మరీ ఎంత తినాలో అంతే తింటుంటారు. అలాగే షుగర్‌తో వచ్చే ఇతర ఆరోగ్య ప్రమాదాల గురించీ ఎంతో అప్రమత్తంగా ఉంటుంటారు. అలాంటి డయాబెటిస్ రోగులకు మరో షాకింగ్ న్యూస్. వారికి మతిమరుపు వచ్చే ప్రమాదం పొంచి ఉందని తాజా అధ్యయనం చెబుతోంది. బోస్టన్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రముఖ డాక్టర్ జెన్నిఫర్ వీవ్ నేతృత్వంలో చేసిన తాజా అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.

డయాబెటిస్ రోగులకు డిమెన్షియా(మతిమరుపు) వచ్చే ప్రమాదం ఉందని ఆ అధ్యయనంలో తేలింది. సాధారణ వ్యక్తుల కంటే వీరికి ఈ వ్యాధి వచ్చే ప్రమాదం మూడు రెట్లు అధికంగా పొంచి ఉందని జెన్నిఫర్ తెలిపారు. సుమారు 2.83లక్షల మందిపై సుదీర్ఘ అధ్యయనం చేసి ఈ విషయాన్ని కనుగొన్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలను అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీకి చెందిన న్యూరాలజీ పత్రికలో ప్రచురితమయ్యాయి. టైప్-1 డయాబెటిస్ ఉన్నవారికి భవిష్యత్తులో మతిమరుపు వ్యాధి వచ్చే అవకాశం 3 రెట్లు అధికంగా ఉందని.. టైప్-2 డయాబెటిస్ వచ్చే వారికి ఈ ముప్పు 2 రెట్లు అధికంగా ఉందని అధ్యయనం చెబుతోంది. సాధారణ వ్యక్తులకు అంటే డయాబెటిస్ లేని వారిలో కేవలం 0.6 శాతం మందికి మాత్రమే డిమెన్షియా రాగా.. టైప్-1 బాధితుల్లో 2.6శాతం మందికి వచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి. టైప్-1 డయాబెటిస్ మొత్తం డయాబెటిస్ కేసుల్లో 5 శాతమే అయినా.. మెదడుపై చాలా ప్రభావం చూపిస్తుందని జెన్నిఫర్ చెబుతున్నారు. ఇలాంటి వారిలో 65 శాతం డిమెన్షియా కేసులను నేరుగా షుగర్ వ్యాధికే ఆపాదించవచ్చని ఆమె వివరించారు. ఈ అధ్యయనం డయాబెటిస్, డిమెన్షియా మధ్య సంబంధాన్ని మాత్రమే చూపించిందని.. దీన్ని ఇంకా శాస్త్రీయంగా నిరూపించలేదని చెప్పుకొచ్చారు. ఈ ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు షుగర్ వ్యాధి రాకుండా చూసుకోవడమే మార్గమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. హెల్తీ డైట్‌తో షుగర్ వ్యాధి బారిన పడకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.

## ఈ ఆకులతో మధుమేహం, ఊబకాయం రెండింటికీ చెక్.. ఎలాగో తెలుసా..!



ప్రస్తుత జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా అనేక అనారోగ్యాలు ప్రబలుతున్నాయి. మధుమేహం, ఊబకాయం లాంటి సమస్యలతో అనేక మంది బాధపడుతున్నారు. ఆ అనారోగ్య సమస్యల నుంచి బయటపడేందుకు చాలామంది అనేక ప్రయత్నాలు చేసి కూడా విఫలమవుతున్నారు. అయితే ఈ మధుమేహం, ఊబకాయం సమస్యలకు చెక్ పెట్టేందుకు జామ ఆకులు అద్భుత ఔషధంగా పనిచేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ ఆకులను క్రమం తప్పకుండా తీసుకోవడంవల్ల ఈ రెండు సమస్యలకే కాకుండా అనేక ఇతర అనారోగ్య సమస్యలకు కూడా పరిష్కారం ఉంటుందని అంటున్నారు. జామాకు ప్రయోజనాలను ఇప్పుడు తెలుసుకుందాం..

### ప్రయోజనాలు..

జామ ఆకుల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. జామ ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి కడుపు పూతల నుంచి శరీరాన్ని రక్షించడంలో సహాయపడుతాయి. దగ్గు, దురద మొదలైన వాటితో బాధపడుతున్నవారు జామ ఆకులను తినాలి. ఎందుకంటే వీటిలో శరీరానికి ఉపశమనాన్ని అందించే యాంటీ అలర్జీ లక్షణాలు ఉంటాయి. అంతేకాదు జామ ఆకులను వివిధ రూపాల్లో తీసుకుంటే ఆరోగ్యం మెరుగుపడుతుంది. జామ ఆకులను క్రమం తప్పకుండా తీసుకుంటూ ఉంటే మగవారికి మేలు చేస్తుంది. సంతానలేమి సమస్యను దూరం చేస్తుంది. జామ ఆకుల సారాన్ని తీసుకుంటే స్పెర్మ్ నాణ్యత, కౌంట్ పెరుగుతుంది. జామ ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ నుంచి ఉపశమనం అందిస్తాయి. జామ ఆకులను రెగ్యులర్‌గా తింటే ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. జామపండుతో ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో జామ ఆకులతో కూడా అంతకుమించి ప్రయోజనాలు పొందవచ్చునని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. జామాకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ మైక్రోబయిల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. జామ ఆకులు క్యాలరీ ఫ్రీ. ఇవి బరువు తగ్గడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. జామ ఆకులను పచ్చిగా తిన్నా కూడా రుచిగా ఉంటాయి. కావాలనుకుంటే జ్యూస్‌లా చేసుకుని తాగవచ్చు. జామ ఆకులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చర్మం ముడతలు మాయమవుతాయి. మొటిమలు, నల్ల మచ్చలను తొలగించడంతో జామ ఆకులు సహాయపడతాయి. జామ ఆకులు హైపర్ పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తాయి. జామ ఆకుల పేస్ట్‌ను అప్లై చేసుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు. జుట్టును ఒత్తుగా మార్చడంలో జామ ఆకుల సారం సహాయపడుతుంది. ఈ రసం తీసుకుంటే జుట్టు మూలాల నుంచి దృఢంగా మారుతుంది. జామ ఆకుల పేస్ట్‌ను తలకు రాసుకుంటే జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. జామ ఆకులలో కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి శరీరానికి సహాయపడే అనేక అంశాలు ఉన్నాయి. జామ ఆకుల టీ తాగితే రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గి, మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. అంతే కాదు శరీరంలో రక్త ప్రసరణను మెరుగుపరిచి గుండె జబ్బుల సమస్యలను దూరం చేస్తుంది. పిండి పదార్థాలు చక్కెరలుగా మారడాన్ని జామ ఆకుల సారం నియంత్రిస్తుంది. దాంతో మధుమేహం అదుపులో ఉంటుంది. ఊబకాయంతో బాధపడేవారు జామ ఆకుల టీ తీసుకోవాలి. జామ ఆకులతో తయారు చేసిన టీ తాగడంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా మారుతుంది. జామ ఆకుల టీతో జీర్ణ వ్యవస్థలో ఉన్న చెడు బ్యాక్టీరియా తొలగుతుంది. ఇందులోని డైటరీ ఫైబరీ జీర్ణ సమస్యలను దూరం చేస్తుంది. జామ ఆకులను తీసుకోవడంతో డెంగ్యూ నుంచి వేగంగా కోలుకోవచ్చు. జామ ఆకులను తీసుకుంటే రక్తంలో ప్లేట్‌లెట్స్ సంఖ్య వేగంగా పెరుగుతుంది. జ్వరం తీవ్రత సైతం తగ్గుతుంది.

## ఈ సీజన్‌లో చాలా మందికి వచ్చే గొంతు పొడిబారే సమస్య.. ఎందుకు వస్తుంది..



శీతాకాలం ముగిసి ఉష్ణోగ్రతలు పెరగడం ప్రారంభమైనప్పుడు, చాలా మందిలో ఒక సాధారణ సమస్య కనిపిస్తుంది. చాలా మందికి ఉదయం లేవగానే గొంతు ఎండి పోయినట్టు, గరుకుగా లేదా గొంతు బిగుసుకున్నట్టు అనిపిస్తుంది. వసంత కాలం పూలతో అందంగా ఉన్నప్పటికీ, అదే సమయంలో గాలిలో పుప్పొడి స్థాయిలు పెరుగుతాయి, వాతావరణ మార్పులు వేగంగా జరుగుతాయి. ఈ మార్పులు శ్వాసకోశ మార్గానికి చికాకును కలిగించి గొంతు అసౌకర్యానికి కారణమవుతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అలర్జీ సంబంధిత శ్వాస సమస్యలతో బాధపడుతున్నారు. భారతదేశంలో వసంత కాలంలో చెట్లు, గడ్డి నుంచి వచ్చే పాలెన్, ధూళి, కాలుష్యం, తేమ మార్పులన్నీ కూడా గొంతు, శ్వాసనాళాలపై ప్రభావం చూపుతాయి.

### కారణాలు ఇవే..

అలాగే వసంతకాలంలో గొంతు ఎండిపోయినట్టు, పొడిగా అనిపించడానికి అనేక కారణాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. వసంత కాలంలో మొక్కలు పెద్ద మొత్తంలో పుప్పొడిని విడుదల చేస్తాయి. ఈ చిన్న కణాలు శ్వాసలోకి వెళ్లినప్పుడు శరీరం హిస్టమిన్స్ ను విడుదల చేస్తుంది. దీంతో ముక్కు, గొంతులో వాపు వస్తుంది. దీని వల్ల గొంతు ఎండిపోవడం, దురద, దగ్గు, గొంతు గరుకుగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. గొంతులో చికాకుకు మరో సాధారణ కారణం పోస్ట్-నాసల్ డ్రిప్. ఈ పరిస్థితిలో మ్యూకస్ గొంతు వెనుక భాగంలో చేరుతుంది. ఇది నిరంతరం గొంతులోకి జారుతుంది. దీంతో నిరంతరం చికాకు, దగ్గు, గొంతు సవరించడం, గొంతు గరగర వంటి లక్షణాలు ప్రేరేపించబడతాయి. అలాగే వసంత కాలంలో ఉష్ణోగ్రతలు మారుతుంటాయి. పొడి గాలులు, ధూళి పెరుగుతాయి. కాలుష్యం ఎక్కువ అవుతుంది. ఇవి గొంతు ఎండిపోవడానికి కారణమవుతాయి. వీటితో పాటు ఇండోర్ వాతావరణాలు కూడా ఈ సమస్యకు దోహదం చేస్తాయి. ూజ గదుల్లో తేమ తగ్గిపోవడం వల్ల గొంతు, ముక్కు ఎండిపోతాయి. ఇంట్లోని పొడి గాలి శ్వాసకోశ మార్గానికి చికాకును కలిగించి అలెర్జీలు ఉన్న వారిలో లక్షణాలు మరింత తీవ్రతరం అవుతాయి.

# ఏడుగురు మహిళల క్రేజీ ప్యారిస్ ట్రిప్.. ఆకట్టుకుంటున్న 'హ్యాపీ జర్నీ' టీజర్!





విభిన్న వయసులు, భిన్న మనస్తత్వాలు కలిగిన ఏడుగురు మహిళలు కలిసి ప్యారిస్ వెకేషన్‌కు వెళ్తే ఎలాంటి క్రేజీ అనుభవాలు ఎదురయ్యాయి అనే ఆసక్తికరమైన కథాంశంతో టాలీవుడ్‌లో సరికొత్త చిత్రం తెరకెక్కుతోంది. అభిరామ్ నాయుడు దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ 'హ్యాపీ జర్నీ' చిత్ర అధికారిక టీజర్ తాజాగా విడుదలై సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. సాధారణంగా వచ్చే కమర్షియల్, పురుష ప్రధాన సినిమాలకు భిన్నంగా, పూర్తిగా మహిళల ఎమోషనల్ బాండింగ్ మరియు రోడ్-ట్రిప్ చుట్టూ తిరిగే హార్ట్-వార్మింగ్ డ్రామాగా ఈ సినిమా రూపొందింది. తమ జీవితాల్లోని బాధలు, ఒత్తిడిని మర్చిపోవడానికి ప్యారిస్ ప్రయాణమైన ఏడుగురు మహిళల జీవితాలు అక్కడ ఎలాంటి మలుపు తిరిగాయనేది ఈ చిత్రంలో చూపించబోతున్నారు. ఈ సినిమాలో సీనియర్ నటీమణులు అన్నపూర్ణమ్మ, ఆమనిలతో పాటు యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జినిషా అలీశెట్టి, రూపా శ్రీనివాస్, సునయన ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్యారిస్ బ్యాక్‌డ్రాప్‌లో అన్నపూర్ణమ్మ, ఆమనిల సందడి ఈ టీజర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే వంశీధర్ గౌడ్, పృథ్వీ దండమూడి, రవి శివతేజ పైలా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాను గుట్ట ప్రొడక్షన్స్ మరియు కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ పతాకాలపై బాలాజీ గుట్ట, కౌశిక్ రెడ్డి నిర్మిస్తుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. శేఖర్ చంద్ర సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి మణికందన్ సుబ్రమణియన్ సినిమాటోగ్రఫీ, ఛోటా కె. ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ప్యారిస్, మాంట్పెలియర్ లాంటి అందమైన యూరోపియన్ లొకేషన్లలో రిఫ్రెషింగ్ విజువల్స్‌తో రూపొందిన ఈ చిత్రం త్వరలోనే థియేటర్లలో సందడి చేయనుంది.

# పవనిజం లింక్‌తో 'హే చికీతా'.. రైతే రాజు కాన్సెప్ట్‌తో టీజర్



బద్రి సినిమాలో హే చికీతా అంటూ వచ్చే పవన్ కల్యాణ్ సాంగ్ బాక్సాఫీస్‌ను ఏ రేంజ్‌లో షేక్ చేసిందో తెలిసిందే. అప్పటికీ ఎప్పటికీ ఆల్‌టైమ్ ఫేవరేట్ సాంగ్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. పవన్ కల్యాణ్ మ్యానరిజం టచ్ చేస్తూ 'హే చికీతా' టైటిల్‌లో సినిమా చేస్తూ మూవీ లవర్స్ ఫోకస్ తనవైపు తిప్పుకుంటున్నాడు డైరెక్టర్ ధన్ రాజ్ లెక్కల. ఈ మూవీలో టెలివిజన్ స్టార్ యాక్టర్, సినీ నటుడు ప్రభాకర్ కూతురు దివిజ హీరోయిన్‌గా నటిస్తోండగా.. ప్రభాకర్ కీలక పాత్రలో నటిస్తున్నాడు.అభినవ్ మణికంఠ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని జులై 24న విడుదల చేస్తున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా పాపులర్ సినిమాటోగ్రఫర్ కేకే సెంథిల్ కుమార్ టీజర్‌ను లాంచ్ చేశాడు. ఓ వైపు లవ్, రిలేషన్స్, మరోవైపు వ్యవసాయం వంటి అంశాలను సినిమాలో చూపించబోతున్నట్టు టీజర్ చెబుతోంది. డైరెక్టర్ ధన్ రాజ్‌లెక్కల మాట్లాడుతూ.. ఊరిలో ఉండే ఓ ఐదుగురు పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ ఏం చేశారనేదే సినిమా కథ అని.. అందుకే ఈ హే చికీతా టైటిల్ పెట్టాం. పవన్ కల్యాణ్ ప్రతీ సినిమాలో ఇంట్రో సాంగ్‌లో 3 నిమిషాల పాటు మెసేజ్ ఇస్తారు.. నేను కూడా అదే లైన్‌లో రైతుల గురించి 3 గంటలపాటు సినిమా చేశానన్నాడు. సుందరకాండ మోషన్ పిక్చర్స్, ఎల్‌ఎల్‌పీ బ్యానర్లపై గరుడ వేగ ఫేం అంజి, ఎన్ అశోక్ ఆర్‌ఎన్‌ఎస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీలో తన్మయి కుషి, దేవీ ప్రసాద్, బలగం సుజాత, అంజిమామ ఇతర నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# శ్రీహరి తనయుడు మేఘాంశ్ శ్రీహరి హీరోగా 'స్టూడెంట్'.. టీజర్ రిలీజ్!




దివంగత రియల్ స్టార్ శ్రీహరి వారసుడిగా టాలీవుడ్‌లో తనదైన గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్న యువ హీరో మేఘాంశ్ శ్రీహరి సరికొత్త యాక్షన్ డ్రామా చిత్రం "స్టూడెంట్" (చూ్బఒవత్) ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. క్యాంపస్ రాజకీయాలు, విద్యార్థి సంఘాల ఘర్షణల నేపథ్యంలో హై-వోల్టేజ్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా అధికారిక టీజర్ తాజాగా విడుదలైంది. ఈ టీజర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. చిత్రంలో మేఘాంశ్ శ్రీహరి పవర్‌ఫుల్ విద్యార్థి నాయకుడిగా ఇంటెన్స్ మాస్ లుక్‌లో కనిపిస్తూ అలరించనున్నారు. ఈ చిత్రంలో మేఘాంశ్ సరసన విజేత పరీక్ హీరోయిన్‌గా నటిస్తోంది. జోవికా సినిమాస్ మరియు చెరిష్ మీడియా వర్క్స్ బ్యానర్లపై బెల్లం సిద్ధారెడ్డి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. బాలు తత్వమసి కథ, స్క్రీన్‌ప్లే అందిస్తూ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేమ్ చంద్ కంచర్ల ఈ సినిమాకు అద్భుతమైన సంగీతాన్ని అందిస్తుండగా, శ్రీనివాస్ బెజుగం సినిమాటోగ్రఫీ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. క్యాంపస్ పాలిటిక్స్, యాక్షన్ మరియు పొలిటికల్ ఎలిమెంట్స్‌తో పాటు చిత్రంలో ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీ కూడా హైలైట్‌గా నిలవనుందని చిత్ర యూనిట్ హింట్ ఇచ్చింది. మేఘాంశ్ శ్రీహరి కెరీర్‌లో ఇదొక ల్యాండ్‌మార్క్ మూవీ అవుతుందని చిత్ర బృందం ఎంతో నమ్మకంగా ఉంది.

# డిన్నర్ సమయంలో పెద్ద వైన్ ట్యాంక్ ఏర్పాటు చేసిన ప్రొడక్షన్ హౌజ్..

## ఆమని సంచలన కామెంట్స్



ఒకప్పుడు తెలుగు సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా వెలుగొందిన నటి ఆమని ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. తన నటనతో ప్రతి పాత్రకు ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తున్న ఆమె, తాజాగా 'హ్యాపీ జర్నీ' అనే చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా టీజర్ విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ఆమని చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 'హ్యాపీ జర్నీ' చిత్రంలో అన్నపూర్ణమ్మ, ఝాన్సీ, ఆమని, పాయల్ రాధాకృష్ణ, రవి శివతేజ, వంశీ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విభిన్న వయసుల వ్యక్తులు కలిసి ప్యారిస్‌కు వెళ్లిన తర్వాత జరిగే ఆసక్తికర సంఘటనల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కినట్లు తెలుస్తోంది.ప్రత్యేకంగా ఈ చిత్రం కోసం యూనిట్ మొత్తం ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లోనే సుదీర్ఘ షెడ్యూల్ నిర్వహించింది. దాదాపు 22 రోజుల పాటు నటీనటులు, సాంకేతిక బృందం అక్కడే ఉండి షూటింగ్ పూర్తి చేశారు.అయితే తాజాగా జరిగిన టీజర్ లాంచ్ కార్యక్రమంలో మాట్లాడిన ఆమని, చిత్ర యూనిట్‌పై ప్రశంసలు కురిపించారు. చాలా కాలం తర్వాత ఇంత సౌకర్యవంతమైన, ఆత్మీయత కలిగిన ప్రొడక్షన్ హౌస్‌తో పనిచేశానని తెలిపారు. ఈ మధ్యకాలంలో ఇంత మంచి ప్రొడక్షన్ హౌస్‌ను నేను చూడలేదు. అందరినీ ఎంతో బాగా చూసుకున్నారు. షూటింగ్ సమయంలో ఎక్కడా ఇబ్బంది అనిపించలేదు అని ఆమని పేర్కొన్నారు. తాను సాధారణంగా డైట్ పాటిస్తానని, కానీ ప్యారిస్‌లో మాత్రం ఆ నియమాలన్నింటినీ పక్కన పెట్టానని ఆమని నవ్వుతూ చెప్పారు.

నేను సాధారణంగా చాలా స్ట్రిక్ట్‌గా డైట్ ఫాలో అవుతాను. కానీ అక్కడ మాత్రం డైట్ గురించి అస్సలు ఆలోచించలేదు. అందరూ కలిసి ఎంతో ఆనందంగా భోజనం చేసేవాళ్లం. నేనూ బాగా తిన్నాను అని ఆమె తెలిపారు. షూటింగ్ సమయంలో యూనిట్ అందించిన సౌకర్యాల గురించి మాట్లాడుతూ, ప్రతి రోజూ ప్రత్యేకంగా డిన్నర్ ఏర్పాట్లు చేసేవారని ఆమని వెల్లడించారు. డిన్నర్ సమయంలో ఒక పెద్ద ట్యాంక్ ఏర్పాటు చేసేవారు. అందులో వైన్ ఉండేది. ఎవరికిష్టమైతే వారు వెళ్లి తీసుకునేవారు. నాన్‌వెజ్‌లో చికెన్, మటన్, ప్రాన్స్, ర్యాబిట్ వంటి అనేక రకాల వంటకాలు ఉండేవి. నేను మాత్రం వెజిటేరియన్ కావడంతో అవేమీ తినలేదు అని ఆమె తెలిపారు. ఆమని చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ప్యారిస్‌లో గడిపిన అనుభవాలు, షూటింగ్ సమయంలో యూనిట్ కల్పించిన సౌకర్యాల గురించి ఆమె చెప్పిన విషయాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

# రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో బాలయ్య-కొరటాల సినిమా..

### మాస్ అవతార్‌లో నందమూరి హీరో!



దర్శకుడు కొరటాల శివ సినిమాల గురించి మాట్లాడినప్పుడు ముందుగా గుర్తుకు వచ్చేది ఆయన ఎంచుకునే బలమైన కథా నేపథ్యాలే. 'మిర్చి' నుంచి 'దేవర' వరకు ఆయన తెరకెక్కించిన ప్రతి చిత్రంలోనూ ఒక ప్రత్యేకమైన సామాజిక, భౌగోళిక లేదా ప్రాంతీయ నేపథ్యం కనిపిస్తుంది. ఆ ప్రాంత ప్రజల జీవన విధానం, సమస్యలు, భావోద్వేగాలను కథలో భాగంగా మలచడం కొరటాల ప్రత్యేకతగా చెప్పవచ్చు.ఇప్పుడు నందమూరి బాలకృష్ణతో కొరటాల శివ చేయబోతున్న కొత్త ప్రాజెక్ట్‌పై కూడా భారీ ఆసక్తి నెలకొంది. ఈ కాంబినేషన్‌లో సినిమా వస్తోందనే వార్త బయటకు వచ్చినప్పటి నుంచే అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. ముఖ్యంగా ఈ చిత్రంలో బాలకృష్ణ సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్నారని ప్రచారం జరుగుతుండటంతో సినిమాపై మరింత ఆసక్తి ఏర్పడింది.తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా రాయలసీమ నేపథ్యంలో తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. గతంలో బాలకృష్ణకు రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన అనేక చిత్రాలు మంచి విజయాలను అందుకున్నాయి. ఇప్పుడు మరోసారి అదే ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని కథను రూపొందిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రత్యేకంగా రాయలసీమలోని నీటి సమస్య, అక్కడి ప్రజల జీవన పరిస్థితులు, సామాజిక అంశాలను కథలో ప్రధానంగా చూపించనున్నారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొరటాల శివ సినిమాల్లో కనిపించే బలమైన సామాజిక అంశాలకు ఇది కూడా కొనసాగింపుగా నిలుస్తుందని అంటున్నారు. ఇక ఈ ప్రాజెక్ట్ ఆగస్టు నెలలో సెట్స్‌పైకి వెళ్లే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలుస్తోంది.మరోవైపు, ఈ చిత్రంలో బాలకృష్ణ పాత్రకు సంబంధించిన ఆసక్తికరమైన వార్తలు కూడా వినిపిస్తున్నాయి. కథలో ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో బాలయ్య పాత్ర మాఫియా నేపథ్యంతో ఉండబోతుందనే ప్రచారం జరుగుతోంది. ఈ పాత్రలో ఆయనను పూర్తిస్థాయి మాస్ అవతార్‌లో చూపించేందుకు కొరటాల ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు టాక్. యాక్షన్‌తో పాటు ఈ సినిమాలో కుటుంబ భావోద్వేగాలకు కూడా పెద్దపీట వేయనున్నారని తెలుస్తోంది. ఫ్యామిలీ ఎమోషన్స్, మాస్ ఎలిమెంట్స్, సామాజిక అంశాలు కలిసి ఈ సినిమాను ప్రత్యేకంగా నిలబెట్టేలా కథను సిద్ధం చేసినట్లు సమాచారం. 'దేవర' తర్వాత కొరటాల శివ తెరకెక్కిస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. కథ, పాత్రలు, నేపథ్యం విషయంలో ఆయన చాలా కసరత్తు చేసినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.



# యజమాని కోసం మూగ వేదన..

**• భాగ్యరాజ్ పార్థివ దేహం వద్ద పెంపుడు కుక్క కన్నీటి క్షణాలు వైరల్**

తమిళ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖ దర్శకుడు, నటుడు, కథా రచయిత కె. భాగ్యరాజ్ ఆకస్మిక మరణం సినీ ప్రపంచాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. దశాబ్దాల పాటు తన కథలతో, దర్శకత్వంతో, నటనతో ప్రేక్షకులను అలరించిన ఈ దిగ్గజ కళాకారుడు గుండెపోటుతో కన్నుమూయడంతో కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్ సినీ వర్గాలు కూడా దిగ్భ్రాంతికి గురయ్యాయి. భాగ్యరాజ్ పార్థివ దేహాన్ని అభిమానులు, సినీ ప్రముఖుల సందర్శన కోసం ఆయన నివాసంలో ఉంచారు. ఈ సమయంలో చోటుచేసుకున్న ఓ దృశ్యం ప్రతి ఒక్కరి హృదయాలను కదిలిస్తోంది. భాగ్యరాజ్ ఎంతో ప్రేమగా పెంచుకున్న పెంపుడు కుక్క తన యజమాని పార్థివ దేహం వద్ద తిరుగుతూ కనిపించింది. శవపేటిక చుట్టూ తిరుగుతూ, తన యజమాని వైపు మౌనంగా చూస్తూ నిలబడిన ఆ మూగజీవి ప్రవర్తన అక్కడున్న వారిని భావోద్వేగానికి గురిచేసింది. తన యజమాని ఇక లేరనే విషయాన్ని అర్థం చేసుకున్నట్లుగా ఆ కుక్క కనిపించడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ దృశ్యాలను చూసిన నెటిజన్లు "జంతువుల విశ్వాసం ఎంతో గొప్పది", "మాటలతో చెప్పలేకపోయినా ఆ బాధ స్పష్టంగా కనిపిస్తోంది అంటూ భావోద్వేగ వ్యాఖ్యలు చేస్తున్నారు. చాలామంది ఆ వీడియోలను షేర్ చేస్తూ ఆ మూగజీవి చూపించిన ప్రేమను ప్రశంసిస్తున్నారు. భాగ్యరాజ్ మృతికి సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పలువురు నటీనటులు, దర్శకులు, అభిమానులు ఆయనకు నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.భాగ్యరాజ్ మరణ వార్త తెలుసుకున్న సినీ ప్రముఖులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకుని చివరి చూపు చూసారు. దశాబ్దాల పాటు భారతీయ సినీ పరిశ్రమకు ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. తెలుగు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు కూడా భాగ్యరాజ్ మరణంపై విచారం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఒక కుటుంబ వేడుకలో ఉత్సాహంగా కనిపించిన ఆయన ఇలా ఆకస్మికంగా కన్నుమూయడం అందరినీ షాక్‌కు గురిచేసింది. ఆదివారం ఆయ న అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో జరిపించారు. కుటుంబ సభ్యులు, అభిమానులు, సినీ ప్రముఖుల మధ్య భాగ్యరాజ్‌కు తుది వీడ్కోలు పలికారు.కథా రచయితగా, దర్శకుడిగా, నటుడిగా భారతీయ సినీ పరిశ్రమపై చెరగని ముద్ర వేసిన భాగ్యరాజ్ మరణం చిత్రసీమకు తీరని లోటుగా నిలిచింది.

# టీమిండియాను ముంచిన ప్రసిధ్, సుందర్..

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 విజయం తర్వాత బరిలోకి దిగిన తొలి మ్యాచ్‌లో టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. పసికూన ఐర్లాండ్ చేతిలో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన ఐర్లాండ్ 34 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. ఈ గెలుపుతో రెండు టీ20ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో ఆడిన తొలి మ్యాచ్‌లోనే టీమిండియాకు ఘోర పరాజయం ఎదురవ్వడం గమనార్హం.అయితే ఈ ఓటమిని అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అనాలోచిత నిర్ణయాలతోనే టీమిండియాకు ఈ ఘోర పరాజయం ఎదురైందని ఆరోపిస్తున్నారు. ఫామ్‌లో ఉన్న వైభవ్ సూర్యవంశీని ఆడిస్తే పరిస్థితి మరోలా ఉండేదని కామెంట్ చేస్తున్నారు. అయితే ఈ మ్యాచ్‌లో టీమిండియా ఓటమికి ప్రధాన కారణం ప్రసిధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్.ఈ మ్యాచ్‌లో ముందుగా బౌలింగ్ చేసిన భారత్.. ఐర్లాండ్‌ను అద్భుతంగా కట్టడి చేసింది. కానీ 16, 17 ఓవర్లు వేసిన వాషింగ్టన్ సుందర్, ప్రసిధ్ కృష్ణ 46 రన్స్ సమర్పించుకోవడంతో ఐర్లాండ్ 118 నుంచి 164కి చేరింది. ఈ రెండు ఓవర్లు కాస్త కట్టడిగా వేసి ఉంటే ఐర్లాండ్ స్కోర్ 140కే పరిమితమయ్యేది. మ్యాచ్ అనంతరం కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా ఇదే విషయాన్ని వెల్లడించాడు. మిడిల్ ఓవర్లలో ప్రణాళికలకు తగ్గట్లు బౌలింగ్ చేయలేకపోయామని, ఆ తప్పిదమే తమ పతనాన్ని శాసించిందని చెప్పాడు. శివమ్ దూబే, అభిషేక్ శర్మ, వాషింగ్టన్ సుందర్ కీలక క్యాచ్‌లు వదిలేయడం కూడా టీమిండియా విజయవకాశాలను దెబ్బతీసింది. ఐర్లాండ్ విధించిన 183 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడం కూడా పెద్ద కష్టమేం కాదు. కానీ భారత టాపార్డర్ దారుణంగా విఫలమైంది. ఏడుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. దాంతో భారత్ 148 పరుగులకే కుప్పకూలింది. అభిషేక్ శర్మ(49) ఒక్కడే పర్వాలేదనిపించాడు. ఈ తప్పిదాలే భారత్ చిత్తుగా ఓడేలా చేశాయి. ఈ పరాజయంతో టీమిండియా చెత్త రికార్డ్ మూటగట్టుకుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్‌పై ఐర్లాండ్‌కు ఇదే తొలి విజయం. ఇప్పటి వరకు 9 టీ20లు, 3 వన్డేలు ఆడిన ఐర్లాండ్ 11 ప్రయత్నాల తర్వాత భారత్‌ను ఓడించింది. దాంతో ఆ జట్టుకు ఇది చారిత్రాత్మక విజయంగా నిలిచిపోయింది. ఇరు జట్ల మధ్య రెండో టీ20 ఆదివారం జరగనుంది.

## ఫైనల్‌కు శ్రీకాంత్



ఫుల్లర్టన్ : భారత స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఫైనల్‌కు ప్రవేశించాడు. ఆదివారం రసవత్తరంగా సాగిన పురుషుల సింగిల్స్ సెమీస్‌లో శ్రీకాంత్.. 22-20, 15-21, 21-19తో ప్రపంచ 33వ ర్యాకర్ యుడాయ్ ఒకిమొటొ (జపాన్)ను ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. ఇక టోర్నీ ఆసాంతం రాణించిన రౌనక్ చౌహాన్‌తో పాటు మహిళల సింగిల్స్‌లో దేవికా సిహాగ్ సెమీస్‌లో పరాజయం పాలయ్యారు.

## క్రికెట్‌కు స్టోక్స్ గుడ్‌బై

నాటింగ్‌హామ్ : ఇంగ్లండ్ టెస్టు క్రికెట్ జట్టు సారథి బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఆధునిక క్రికెట్‌లో మేటి ఆల్‌రౌండర్లలో ఒకడిగా గుర్తింపు పొందిన 35 ఏండ్ల స్టోక్స్.. తన 15 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు చెబుతూ.. నాటింగ్‌హామ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న నిర్ణయాత్మక మూడో టెస్టే తన కెరీర్‌లో ఆఖరిదని తెలిపాడు. నాలుగో రోజు ఆట ప్రారంభం సందర్భంగా ఇంగ్లండ్ కెప్టెన్ తన నిర్ణయాన్ని ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచాడు.ఇంగ్లండ్ 2019 లో గెలిచిన వన్డే ప్రపంచకప్‌తో పాటు 2022లో సాధించిన టీ20 వరల్డ్‌కప్ విజయాల్లో స్టోక్స్ కీలకపాత్ర పోషించాడు. 2022లో ఇంగ్లండ్ టెస్టు జట్టు పగ్గాలు అందుకున్న అతడు.. 'బజ్‌బాల్' ఆటతీరుతో టెస్టులను రసవత్తరంగా మార్చాడు. నాలుగేండ్ల కెప్టెన్సీ కెరీర్‌లో ఇంగ్లిష్ జట్టుకు మరుపురాని విజయాలను అందించాడు.

## వారెవ్వా ఐర్లాండ్..
## టీమిండియాకు దిమ్మతిరిగే షాక్

- టీ20 సిరీస్ కైవసం
- 16 సిరీస్‌ల జైత్రయాత్రకు బ్రేక్




బెల్‌ఫాస్ట్ : జూన్ 28, 2026.. ఐర్లాండ్ క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇంకా పసికూనగానే చలామణి అవుతున్న ఆ జట్టు అద్భుతమే చేసింది. వరుసగా రెండు టీ20 ప్రపంచకప్ ఎడిషన్లలో మేటి జట్లను కంగుతినిపించిట్రోఫీలు గెలిచిన భారత జట్టుకు దిమ్మతిరిగే షాకిస్తూ రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం ఇక్కడ చివరి బంతి వరకూ రసవత్తరంగా సాగిన పోరులో ఐరిష్ జట్టు.. ఒక్క పరుగు తేడాతో టీమిండియాను చిత్తుచేసి సిరీస్‌ను కైవసం చేసుకుంది.ప్రత్యర్థి నిర్దేశించిన 154 పరుగుల ఛేదనలో మరోసారి బ్యాటింగ్ వైఫల్యంతో చేతులెత్తేసిన భారత్.. 153/9 వద్దే ఆగిపోయి ఓటమిని మూటగట్టుకుంది. తిలక్ వర్మ (46 బంతుల్లో 55, 3 ఫోర్లు, 1 సిక్స్), హర్షిత్ రాణా (10 బంతుల్లో 21, 2 ఫోర్లు, 1 సిక్స్) మినహా మిగిలినవారంతా మళ్లీ చేతులెత్తేశారు. గత మ్యాచ్‌లో భారత్‌ను దెబ్బకొట్టిన భారత సంతతి బౌలర్ జై మూంద్రా, మాథ్యూ హేలార్డ్ తలా మూడు వికెట్లతో మరోసారి ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. జైకే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ అవార్డులు లభించాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్.. హ్యారీ టెక్టర్ (53), బెంజిమిన్ (37) రాణించడంతో 154/8 చేసింది. ప్రిన్స్ యాదవ్ (3/22) మెరిశాడు.

### తిలక్, రాణా పోరాడినా..

లక్ష్యం చిన్నదే అయినా ఛేదన తేలికేం కాదని భారత్‌కు తొలి ఓవర్లోనే తెలిసొచ్చింది. కొత్త బంతితో జై మరోసారి నిప్పులు చెరిగాడు. మొదటి బంతికే సంజూ శాంసన్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న అతడు.. నాలుగో బాల్‌కు అభిషేక్‌నూ పెవిలియన్‌కు పంపాడు. తన మరుసటి ఓవర్లో శ్రేయస్‌ను అద్భుతమైన బంతితో క్లీన్‌బౌల్డ్ చేశాడు. తిలక్‌తో సమన్వయ లోపంతో ఇషాన్ (12) రనౌట్ అయ్యాడు. వర్షం అంతరాయం తర్వాత తిరిగి ఆరంభమైన మ్యాచ్‌లో అక్షర్ (14), దూబె (20), విఫలమయ్యారు. ఫిఫ్టీ తర్వాత తిలక్ కూడా ఔట్ అవగా రాణా మెరుపులతో భారత్ విజయానికి చేరువైనా ఐదో బంతికి అతడు నిష్క్రమించడం పర్యాటక జట్టును దెబ్బతీసింది. ఈ ఓటమితో 16 ద్వైపాక్షిక సిరీస్ విజయాల భారత జైత్రయాత్రకు అడ్డుకట్ట పడింది. 2023 ఆగస్టు తర్వాత భారత జట్టు టీ20ల్లో సిరీస్ కోల్పోవడం ఇదే ప్రథమం. ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన సారథిగా నిలిచి భారత జట్టు పగ్గాలను అందుకున్న శ్రేయస్.. సిరీస్ ఓటమితో తన కెప్టెన్సీ కెరీర్‌ను ఆరంభించడం గమనార్హం.

## అర్జెంటీనా హ్యాట్రిక్.. మెస్సీ ఖాతాలో మరో గోల్

**నాకౌట్‌కు చేరిన 9 ఆఫ్రికా దేశాలు**

అర్లింగ్టన్ (యూఎస్ఏ) : ఫిఫా ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా హ్యాట్రిక్ కొట్టింది. సారథి లియోనల్ మెస్సీ మ్యాజిక్‌తో జోరుమీదున్న ఆ జట్టు.. భారత కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో 3-1తో జోర్డాన్‌ను ఓడించి గ్రూప్ దశను గెలుపుతో ముగించింది. వరుసగా రెండు విజయాలతో ఇదివరకే రౌండ్ ఆఫ్ -32కు అర్హత సాధించిన నేపథ్యంలో మెస్సీతో పాటు 9 మంది ఆటగాళ్లను బెంచ్ మీద ఉంచిన ఆ జట్టు.. రెండో అర్ధ భాగంలో కెప్టెన్‌ను బరిలోకి దించి అభిమానులను ఉర్రూతలూగించింది. మ్యాచ్‌లో సుమారు 70 శాతం బంతిని తమ అధీనంలో ఉంచుకున్న వరల్డ్ చాంపియన్లు ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై వరుసగా దాడులకు దిగి ఫలితాన్ని రాబట్టారు.తొలి ప్రపంచకప్ ఆడుతున్న జియోవని లొ సెల్సొ 19వ నిమిషంలోనే డైరెక్ట్ ఫ్రీ కిక్‌తో తొలి గోల్‌ను అందించాడు. 31వ ని.లో లౌటారొ మార్టినెజ్ పెనాల్టీ కిక్‌ను గోల్‌గా మలిచి తన జట్టు 2-0 ఆధిక్యానికి తీసుకెళ్లాడు.

# భారత్ ఇంటికి.. వరల్డ్ కప్‌లో ముగిసిన అమ్మాయిల కథ

**ఆస్ట్రేలియా చేతిలో ఓటమి గూప్ దశలోనే ఇంటిబాట పట్టింది. భారత్ నిర్దేశించిన 171 పరుగుల లక్ష్యాన్ని కంగారూలు.. 19 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించారు. ఎలీస్ పెర్రీ (38 బంతుల్లో 56, 8 ఫోర్లు), ఆల్‌రౌండర్ ఆష్లీ గార్డ్‌నర్ (29 బంతుల్లో 53 నాటౌట్, 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ మెరుపులతో టీ20 ప్రపంచకప్‌లో ఉమెన్ ఇన్ బ్లూకు నిరాశ తప్పలేదు.**



బౌలింగ్ వైఫల్యంతో భారత్ భారీ మూల్యం చెల్లించుకుంది. అంతకుముందు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (27 బంతుల్లో 56, 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకానికి తోడు స్మృతి మంధాన (38), షెఫాలీ వర్మ (34), జెమీమా రోడ్రిగ్స్ (34) రాణించడంతో భారత్.. నిర్ణీత ఓవర్లలో 170/4 పరుగులు చేసింది. ఈ ఓటమితో భారత్ టోర్నీ నుంచి నిష్క్రమించగా గ్రూప్-ఏ నుంచి ఆస్ట్రేలియా (10 పాయింట్లు), దక్షిణాఫ్రికా (8 పాయింట్లు) సెమీస్‌కు దూసుకెళ్లాయి. అంతకుముందు సఫారీ జట్టు.. 4 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించి సెమీస్ మార్గాన్ని సుగమం చేసుకుంది.

### విజయాన్ని దూరం చేసిన పెర్రీ, ఆష్లీ

టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్ బ్యాటింగ్‌లో ఫర్వాలేదనిపించింది. గత మ్యాచ్‌లతో పోలిస్తే కీలక పోరులో ఓపెనర్లతో పాటు మిడిలార్డర్‌లో హర్మన్‌ప్రీత్ దూకుడుగా ఆడి జట్టుకు భారీ స్కోరును అందించింది. ఇక ఛేదనలో 4 పరుగులకే ఆసీస్ తొలి వికెట్ కోల్పోగా మూనీ (22), లిచ్‌ఫీల్డ్ (24) నిలకడగా ఆడి ఆ జట్టును పోటీలోకి తెచ్చారు. ఈ ఇద్దరి నిష్క్రమణ తర్వాత వచ్చిన పెర్రీ, ఆష్లీ భారత్‌కు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా పనిపూర్తిచేశారు. ఈ జోడీ నాలుగో వికెట్‌కు 57 బంతుల్లోనే వంద పరుగులు జోడించి భారత్‌కు విజయాన్ని దూరం చేశారు.

# టీమిండియా ఖాతాలో 5 అవమానకర రికార్డులు



ర్లాండ్‌తో బెల్ఫాస్ట్‌లోని సివిల్ సర్వీస్ క్రికెట్ క్లబ్ మైదానంలో జరిగిన మొదటి టీ20 మ్యాచ్‌లో భారత క్రికెట్ జట్టుకు పెద్ద అవమానం ఎదురైంది. 183 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా కేవలం 148 పరుగులకే కుప్పకూలిపోయి 34 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. అయితే ఈ మ్యాచ్‌లో భారత్ కేవలం మ్యాచ్ మాత్రమే ఓడిపోలేదు, తమ ఖాతాలో ఎవరూ కోరుకోని ఐదు అత్యంత అవమానకర రికార్డులను కూడా లిఖించుకుంది. భారత క్రికెట్ చరిత్రలో ఐర్లాండ్ చేతిలో టీమిండియా ఓడిపోవడం ఇదే తొలిసారి. 2007వ సంవత్సరంలో ఈ రెండు దేశాల మధ్య మొదటి అంతర్జాతీయ మ్యాచ్ జరిగింది. అప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన 11 మ్యాచ్‌ల్లోనూ భారత్ అజేయంగా నిలిచింది. కానీ తాజా మ్యాచ్‌లో ఐర్లాండ్ అద్భుత ప్రదర్శనతో భారత్‌పై తొలి విజయాన్ని నమోదు చేసి చరిత్ర సృష్టించింది. దీనితో అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్‌ను ఓడించిన 11వ జట్టుగా ఐర్లాండ్ నిలిచింది.టీమిండియా వరుసగా రెండోసారి టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత ఆడిన తన మొదటి మ్యాచ్‌లోనే ఘోరంగా ఓడిపోయింది. గతంలో 2024లో టీ20 ప్రపంచ కప్ ఛాంపియన్‌గా నిలిచిన వెంటనే జింబాబ్వే పర్యటనకు వెళ్లిన భారత్, అక్కడ జరిగిన మొదటి మ్యాచ్‌లోనే ఓడిపోయింది. ఇప్పుడు 2026లో కూడా సరిగ్గా అదే సీన్ రివర్స్ అయింది. వరల్డ్ కప్ గెలిచిన ఆనందంలో ఉన్న భారత్‌కు మొదటి మ్యాచ్‌లోనే పరాజయం ఎదురైంది. భారత ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ ఈ మ్యాచ్‌లో దారుణంగా విఫలమయ్యాడు. ఆయన తన 4 ఓవర్ల కోటాలో ఏకంగా 57 పరుగులు సమర్పించుకున్నాడు. అంతకుముందు ఆడిన తన మునుపటి టీ20 మ్యాచ్‌లో కూడా ఆయన 68 పరుగులు ఇచ్చాడు. దీనితో వరుసగా రెండు అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌ల్లో కలిపి ఏకంగా 125 పరుగులు సమర్పించుకున్న మొదటి భారతీయ బౌలర్‌గా ప్రసిద్ధ్ కృష్ణ ఒక అపకీర్తిని తన ఖాతాలో వేసుకున్నాడు.ఈ మ్యాచ్‌లో ప్రసిద్ధ్ కృష్ణ వేసిన బౌలింగ్ స్పెల్ ఆయనకు ఒక పీడకలలా మిగిలిపోనుంది. మ్యాచ్ 17వ ఓవర్ వేసిన ఆయన బౌలింగ్‌లో ఐర్లాండ్ బ్యాటర్లు ఉతికేసారు. ముఖ్యంగా గారెత్ డెలానీ వరుసగా మూడు సిక్సర్లు బాదడంతో ఆ ఒక్క ఓవర్లోనే ఐర్లాండ్ జట్టు ఏకంగా 27 పరుగులు రాబట్టింది. దీనితో ఐర్లాండ్‌తో జరిగిన టీ20 క్రికెట్ చరిత్రలోనే అత్యంత ఎక్కువ పరుగులు ఇచ్చిన భారత బౌలర్‌గా ప్రసిద్ధ్ రికార్డు సృష్టించాడు.భారత పూర్తి స్థాయి టీ20 కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్‌కు ఇది మొదటి మ్యాచ్. కానీ దురదృష్టవశాత్తు కెప్టెన్‌గా తన తొలి మ్యాచ్‌లోనే ఆయనకు ఓటమి ఎదురైంది. దీనితో అంతర్జాతీయ టీ20ల్లో కెప్టెన్‌గా చేసిన మొదటి మ్యాచ్‌లోనే ఓడిపోయిన నాలుగో భారతీయ కెప్టెన్‌గా అయ్యర్ నిలిచాడు. అంతకుముందు విరాట్ కోహ్లీ, రిషబ్ పంత్, శుభ్‌మన్ గిల్ కూడా కెప్టెన్‌గా తమ మొదటి టీ20 మ్యాచ్‌ల్లో ఓటమిని చవిచూశారు.

## ప్రణాళికలకు తగ్గట్లు బౌలింగ్ చేయలేదు

**టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్**

మిడిల్ ఓవర్లలో ప్రణాళికలకు తగ్గట్లు బౌలింగ్ చేయకపోవడం తమ పతనాన్ని శాసించిందని టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అన్నాడు. మిడిల్ ఓవర్లలో కట్టడిగా బౌలింగ్ చేసి ప్రత్యర్థిని 140 పరుగులకు కట్టడి చేసి ఉంటే లక్ష్యాన్ని ఛేదించడం సులువయ్యేదని తెలిపాడు.రెండు టీ20ల సిరీస్‌లో భాగంగా ఐర్లాండ్‌తో శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన భారత్ 34 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన శ్రేయస్ అయ్యర్..బ్యాటింగ్ కంటే బౌలింగ్ వైఫల్యమే తమ ఓటమికి ప్రధాన కారణమని చెప్పుకొచ్చాడు. గ్రౌండ్‌కు తగ్గట్లు బౌలింగ్ చేయాలేకపోయామని తెలిపాడు.'ఆరంభంలో మా బౌలర్లు చాలా బాగా బౌలింగ్ చేశారు. వారికి పిచ్ నుంచి స్వింగ్ లభించింది. రెండు వికెట్లు కూడా తీశారు. దాంతో మాకు అద్భుతమైన ఆరంభం దక్కింది. కానీ మిడిల్ ఓవర్లలో మా ప్రణాళికలను సరిగ్గా అమలు చేయలేకపోయాం. ఈ గ్రౌండ్ బౌండరీలు చాలా చిన్నవని తెలిసినప్పటికీ, స్ట్రెయిట్ షాట్లు ఆడేలా బంతులు వేసాం. డెత్ ఓవర్లలో మా బౌలర్లు తిరిగి పుంజుకున్నారు. మాకు లభించిన ఆరంభాన్ని బట్టి చూస్తే.. ఐర్లాండ్‌ను 140 పరుగులకు కట్టడి చేసి ఉంటే ఛేజ్ చేయడానికి సులువయ్యేది. ఫలితం ఎలా ఉన్నప్పటికీ.. ఇక్కడ ఆడటం ఒక గొప్ప అనుభవం. ఈ వాతావరణ పరిస్థితుల్లో ఆడే అవకాశం మాకు దక్కింది. పిచ్ ఎలా ఉందనే దానిపై ఒక స్పష్టమైన అవగాహన వచ్చింది. కెప్టెన్‌గా నాకైతే ఇది మంచి అనుభవమే. సుదీర్ఘ విరామం తర్వాత ఆడటం వల్ల కూడా మా జట్టు కాస్త తడబడింది. ఈ మ్యాచ్ ఫలితాన్ని వీలైనంత త్వరగా మర్చిపోయి.. తదుపరి మ్యాచ్ కోసం సిద్ధమవుతాం. అయితే ఈ ఓటమి నుంచి మేం నేర్చుకోవాల్సింది చాలా ఉంది. తదుపరి మ్యాచ్‌లో సరికొత్త ఉత్సాహం,రెట్టింపు బలంతో బరిలోకి దిగుతాం.హర్షిత్ రాణా , శివమ్ దూబే అద్భుతంగా బౌలింగ్ చేశారు. పిచ్ నుంచి వారికి సహకారం లభించింది. శివం విషయానికి వస్తే.. అతను గతంలోనూ చాలా కీలకమైన ఓవర్లు వేశాడు. అందువల్ల నేను అతన్ని ఎల్లప్పుడూ సపోర్ట్ చేస్తాను. నేను దేశవాళీ క్రికెట్‌లోనూ అతనితో కలిసి ఆడాను కాబట్టి అతని బలాలు, బలహీనతలు నాకు బాగా తెలుసు. అలాగే హర్షిత్ రాణా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. గాయం నుంచి కోలుకుని వచ్చి.. ఈ స్థాయిలో రాణించడం చాలా గొప్ప విషయం.క్రికెట్‌లో ఈ విషయాన్ని అంత తేలికగా తీసుకోలేం. మైదానంలోకి అడుగుపెట్టగానే మ్యాచ్‌లు గెలవడం సాధ్యం కాదు. ఇక్కడ కష్టపడాలి, ఆ క్షణంలో ఆటపైనే దృష్టి పెట్టాలి. నేను ఇంతకు ముందు చెప్పినట్లుగా.. ఎప్పుడూ ప్రస్తుతంలోనే జీవించాలి. ప్రత్యర్థిని దెబ్బతీసే అవకాశం వచ్చినప్పుడు, దాన్ని ఖచ్చితంగా ఉపయోగించుకోవాలి. ఏ ఒక్క క్షణాన్ని లేదా పరిస్థితిని కూడా ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదు. తదుపరి మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం.'అని అయ్యర్ చెప్పుకొచ్చాడు.ఈ గెలుపుతో ఐర్లాండ్ చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్‌పై తొలి విజయాన్ని నమోదు చేసింది. గత 8 ప్రయత్నాల్లో దక్కని విజయం ఈ మ్యాచ్‌లో వరించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 182 పరుగులు చేసింది. అనంతరం భారత్ 18.5 ఓవర్లలో 148 పరుగులకు ఆలౌటై ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. అభిషేక్ శర్మ(20 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 49) రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ఐర్లాండ్ బౌలర్లలో మ్యాట్ హోల్డార్డ్(3/28), మాథ్యూ హంఫ్రేస్(3/38) మూడేసి వికెట్లతో భారత్ పతనాన్ని శాసించారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609